Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 204 పేజీలు 8 వెల : 5 ఆదివారం 15 ఫిబ్రవరి 2026

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో

మరో సంచలనం

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత తెలుగు దినపత్రికకు మరియు UV9 కేబుల్ Tv చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

ఉత్తేజిత దినపత్రిక UV9

Contact : 94401 40418, 63038 17489


2లో..

పార్టీ నేతలతో లోకేశ్ విందు

## సమావేశం

విజయవాడ, గుంటూరు నేతలతో భేటీ

ఆత్మీయంగా పలకరింపులు..



# 3,32,205 కోట్లతో బడ్జెట్

## అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు

స్వర్ణాంధ్ర విజన్-2047కు బాటలు వేస్తూ 2025లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు.

తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు.

రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు

మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా

రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు

విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు

రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు

ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు

జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు

మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు

అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు

పోలవరం రూ.6,105 కోట్లు కేటాయింపు

2లో..

విభజన సమస్యలతో పాటు, గత ఐదేళ్ల నష్టాలను అధిగమించేలా ముందుచూపు బడ్జెట్ అంటే కేవలం లెక్కులు మాత్రమే కాదు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

బ్రాండ్ చంద్రబాబు వల్లే స్వర్ణాంధ్ర సాకారమన్నారు ఆర్థిక మంత్రి . గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకుంది బాహుబలి ఒప్పందమని తెలిపారు. రైతుల కలలను నెరవేర్చేలా, యువతకు ఉద్యోగవకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందన్నారు.




2లో..

# పెర్ఫామెన్స్ వీక్, పబ్లిసిటీ పీక్

బడ్జెట్ పుస్తకంలో బొమ్మలు హైలెట్

ఆదాయ వ్యయాలపై పొంతలన లేని లెక్కలు

బడ్జెట్ తీరుపై మండిపడ్డ మాజీ ఆర్థికమంత్రి బుగ్గన

బడ్జెట్ పుస్తకంలో బొమ్మలు తప్ప అసలు ఆదాయాలు, ఖర్చుల స్పష్టమైన వివరాలు లేవని ఆరోపించారు. ఏపీ బ్జడెట్ 2026-27పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు . ఇప్పటికే రూ.3.12 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారని, కానీ రాష్ట్ర మొత్తం అప్పులపై స్పష్టత ఇవ్వలేదని అన్నారు.


2లో..

## సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేలే ప్రోగ్రెస్ రిపోర్ట్

మారకపోతే మీకే నష్టం తప్పదు

ఎమ్మెల్యేకు బాబు గట్టి హెచ్చరిక


2లో..

వ్యవసాయంతోనే ఆర్థికరంగం

# బలోపేతం

దేశ వ్యవసాయ రంగంలో ఎపి వాటా 10 శాతం

వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధింపు

పీఎం కిసాన్ పథకం కింద రూ.6,600 కోట్లు వ్యవసయా బడ్జెట్ ప్రవేశ పెట్టిన అచ్చన్నాయుడు


2లో..

ఫార్ములా-ఈ కార్ రేసులో కీలక పరిణామం


2లో..

# బడ్జెట్ అంతా అంకెట గారడీ

ప్రజలకు ఉపయోగపడేలా లేదు

ప్రజల ఆసక్తిని నీరుగార్చిన బడ్జెట్

విమర్శలు గుప్పించిన వైసిపి నేత బొత్స

## కరీంనగర్‌లో బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయం

కరీంనగర్:కరీంనగర్‌లో మేయర్ పదవి కోసం ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'మేయర్' పదవి కోసం బీఆర్ఎస్ తన సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కైనట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ జనతా పార్టీని ఓడించేందుకు మూడు పార్టీలు ఒక్కటైనట్లు సమాచారం. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీజేపీని ఓడించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండిపెండెంట్ కార్పొరేటర్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు శుక్రవారం రాత్రి సదరు కార్పొరేటర్‌తో సమావేశమయ్యారు. అదే సమయంలో బీఆర్ఎస్ నేతలు కూడా కార్పొరేటర్‌తో రహస్యంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఇండిపెండెంట్లు, ఇతర కార్పొరేటర్లు, బీజేపీ సభ్యుల మద్దతు కోసం ఆఫర్లు ఇవ్వాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు మేయర్‌గా మద్దతిస్తే ఆర్థిక సహాయం కూడా అందిస్తానని కూడా ఆ ఇండిపెండెంట్ కార్పొరేటర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలను కమలం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. తమ పార్టీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యగా బీజేపీ అభివర్ణిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఇది ప్రజలను మోసం చేయడమేనని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విపక్షాల డ్రామాలను ఆధారాలతో సహా ఎండగట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం. కరీంనగర్ మేయర్ పీఠం చుట్టూ జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక నగరానికి పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా ఉన్నాయి. బండి సంజయ్ మీడియా సమావేశం తర్వాత ఈ వ్యవహారం మలుపులు తిరిగే అవకాశం ఉంది.

## మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

హైదరాబాద్: తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

## సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేలే ప్రోగ్రెస్ రిపోర్ట్

అమరావతి: ఎమ్మెల్యేల పనితీరు మారకపోతే వారికే నష్టమని, సీఎం నారా చంద్రబాబు నాయుడు తన పాలనా శైలిపై మరోసారి స్పష్టత ఇచ్చారు. 1995-96లో తన పాలనలో ఉన్న నిక్కచ్చితత్వాన్ని మరోసారి పునరావృతం చేస్తానని ఆయన ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వారికి సీల్డ్ కవర్లలో నివేదికలు ఇస్తున్నామని తెలిపారు. ఈ నివేదికల ద్వారా వారిని వారికే అద్దంలో చూపిస్తున్నామని, మారకపోతే వారికే నష్టమని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు నాయుడు శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. '1995-96 మాదిరిగానే నిక్కచ్చిగా ఉంటా. 9 అంశాల్లో సర్వే చేయించి నివేదికలు ఇస్తున్నా. సీల్డ్ కవర్లలో ఇచ్చే ఈ నివేదికల ద్వారా ఎమ్మెల్యేల పనితీరు, లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాం. మారకపోతే వాళ్లకే నష్టం' అని చంద్రబాబు అన్నారు. ఇక నుంచి ఎమ్మెల్యేల పనితీరుపై అత్యంత కఠినంగా వ్యవహరించనున్నానని సీఎం పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ పనితీరుపై సీఎం చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. 'లోకేష్ పని లోకేష్ చేస్తున్నారు, నా పని నేను చేస్తున్నాను' అని స్పష్టం చేశారు. ముఖ్యంగా మంగళగిరి చేనేత చీరలకు లోకేష్ కల్పిస్తున్న అంతర్జాతీయ బ్రాండింగ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.?

## పార్టీ నేతలతో లోకేశ్ విందు సమావేశం

**అమరావతి**: రాజకీయ వ్యూహాలు, అసెంబ్లీ బడ్జెట చర్చల బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ.. మంత్రి నారా లోకేష్ ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని.. ఆయన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వనభోజనాల తరహాలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయ చర్చలకు తావులేకుండా, కేవలం కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, వారికి గల క్రీడాభిలాషపై మాట్లాడుకున్నారు. సమావేశానికి వచ్చిన చిన్నపిల్లలతో లోకేష్ సరదాగా కబుర్లు చెబుతూ గడిపారు. చదువు, కెరీర్ ఒక్కటే జీవితం కాదు..పిల్లలు క్రీడలను కూడా కెరీర్‌గా ఎంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి' అని లోకేష్ ఈ సందర్భంగా సూచించారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు లోకేష్ ప్రతి అవకాశాన్నీ వాడుకుంటున్నారు. ఈ సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసి తన నియోజకవర్గ బ్రాండింగ్‌ను చాటుకున్నారు. కేవలం విందుకే పరిమితం కాకుండా.. బాధ్యతాయుతమైన నాయకుడిగా లోకేష్ మరో అడుగు వేశారు. గతంలో ఆయా నియోజకవర్గాల నాయకులు తనకు ఇచ్చిన వినతులపై తాజా పరిస్థితి ఏంటి? పనులు ఏ దశలో ఉన్నాయి? అనే అంశాలతో కూడిన స్టేటస్ రిపోర్టులను స్వయంగా ఆయా నాయకులకు అందజేశారు. ఈ విందులో గుంటూరు ఎంపీ / కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ (తెనాలి-జనసేన), ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్ (తాడికొండ),ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు),బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు),
గల్లా మాధవి (గుంటూరు వెస్ట్),నసీర్ అహ్మద్ (గుంటూరు ఈస్ట్),ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని),తంగిరాల సౌమ్య (నందిగామ),శ్రీరాం రాజగోపాల్ (జగ్గయ్యపేట),వసంత వెంకట కృష్ణప్రసాద్ (మైలవరం),కొలికపూడి శ్రీనివాసరావు (తిరువూరు)బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ సెంట్రల్),గద్దె రామమోహన రావు (విజయవాడ ఈస్ట్)
ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వీరిలో ఉన్నారు.

## వ్యవసాయంతోనే ఆర్థికరంగం బలోపేతం

అమరావతి:2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, దాని ద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. యువత వ్యవసాయం వైపు మళ్లాలంటే రంగం లాభదాయకంగా మారాలని మంత్రి చెప్పుకొచ్చారు. అధిక పోషక విలువలు ఉండే పంటల సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం కల్పిస్తామని చెప్పారు. దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతం ఉందని, 11 పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని వెల్లడించారు. వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధించిందని తెలిపారు. పంటలను కాపాడేందుకు రైతులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని తెలిపారు. సాగునీటి సౌకర్యాల కల్పనకు బిందు సేద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు మంత్రి. ప్రభుత్వం రైతులకు వివిధ రూపాల్లో సాయం అందిస్తోందని వివరించారు. 24 గంటల్లో 9 వేల కోట్ల రూపాయలకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పీఎం కిసాన్ పథకం కింద రూ.6,309 కోట్లు చెల్లించామన్నారు. 2026-27లో దానిని రూ.6,600 కోట్లకు పెంచామని చెప్పారు. ధాన్యం సేకరణ బకాయిలుగా రూ.1,674 కోట్లు చెల్లించామని తెలిపారు. భూసార పరీక్షల ద్వారా 6 లక్షల భూసార పరీక్ష పత్రాలు అందజేశామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో 18 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు అందించామని పేర్కొన్నారు.

# రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు



అమరావతి: 2026-27కు సంబంధించిన వార్షిక బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఏపీ అసెంబ్లీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. వరుసగా మూడోసారి ఆయన బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్.. రెండు సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన పయ్యావుల.. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లుగా అంచనా వేశారు. అయితే, రాష్ట్ర రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లుకు చేరింది. 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు ఉంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రూ. 80,567.47 కోట్ల ద్రవ్య లోటుగా నమోదు అయింది. ఇక, 2026-27బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2026-27 వార్షిక బ్జడెట్: రూ.3,32,205 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు,మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు,రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు,ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లుగా చూపారు. ప్రధానంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, 'వీబీ జీ రామ్ జీ'కి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సర్దుబాటు నిధి రూ.1,500 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన
రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులు పరిశీలిస్తే ...ఎన్టీఆర్ భరోసా - రూ.27,719 కోట్లు,దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు - రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి - రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో - రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు
స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు,ఉపకార వేతనాలు రూ.3,836 కోట్లు ,మగ్ర శిక్ష రూ.2,946 కోట్లు
ఉన్నత విద్య రూ.2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం- రూ.2,161 కోట్లు ,మనబడి మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి కిరూ.1,232 కోట్లు,పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకు రూ.654 కోట్లు, యువత, క్రీడలు రూ.438 కోట్లు
కేటాయించారు. శాఖల వారిగా బ్జడెట్ కేటాయింపులు పరిశీలిస్తే... వ్యవసాయ అనుబంధ రంగాలు - రూ.13,598 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ - రూ.22,942 కోట్లు, మున్సిపల్ శాఖ - రూ.14,539 కోట్లు
జలవనరుల శాఖ - రూ.18, 224 కోట్లు, పాఠశాల విద్యాశాఖ - రూ.32,308 కోట్లు, ఇంధన శాఖ - రూ.13,934 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ - రూ.11,118 కోట్లు, కార్మిక శాఖ - రూ.735 కోట్లు, గృహ నిర్మాణ శాఖ - రూ.6357 కోట్లు, రోడ్లు, భవన నిర్మాణాల శాఖ - రూ.9,856 కోట్లు, హోం శాఖ - రూ.9,165కోట్లు కేటాయించారు. ఇక ఇతర కేటాయింపులు పరిశీలిస్తే ..పోలీస్ శాఖకు 3 వేల కొత్త వాహనాలు
కొత్త పోలీస్ అకాడమీ కోసం 94 ఎకరాలు,ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు,జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు,స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు,విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు,రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు, కేటాయించారు. వరుసగా మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తన అదృష్టమని అన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా బ్జడెట్ రూపొందించినట్లు తెలిపారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేది బడ్జెట్ అన్నారు. కుటుంబాన్ని నడిపిస్తున్న గృహిణికి భరోసా ఇచ్చేది బడ్జెట్ అని చెప్పుకొచ్చారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలో పరుగులు పెట్టించాలనే సంకల్పం తమది అని స్పష్టం చేశారు. బ్రాండ్ చంద్రబాబు వల్లే స్వర్ణాంధ్ర సాకారమన్నారు ఆర్థిక మంత్రి . గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకుంది బాహుబలి ఒప్పందమని తెలిపారు. రైతుల కలలను నెరవేర్చేలా, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందన్నారు. పాలన ఎలా చేయకూడదో అనేది గత ప్రభుత్వ రాష్ట్రానికి చేసిన నష్టాన్ని చూస్తే అర్థమవుతుందని తెలిపారు . గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దేలా 2024లో బడ్జెట్ ప్రవేశపెడితే... స్వర్ణాంధ్ర విజన్-2047కు బాటలు వేస్తూ 2025లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్థిక విధ్వంసం ఎదుర్కొన్న రాష్ట్రాన్ని సరిదిద్దడానికి రెండేళ్ల సమయం ఎంత మాత్రమూ సరిపోదని మంత్రి చెప్పారు. రాష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు... గత ప్రభుత్వ పాలన కూడా తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు మంత్రి. చాలా సవాళ్లు ఉన్నా రాష్ట్రం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి జరిగిందని చెప్పడానికి గర్వపడుతున్నానని అన్నారు. ఇప్పటి వరకు ఏం సాధించాం... ఇంకా ఏం సాధించాలనే అంశాల ఆధారంగా బ్జడెట్ రూపొందించామని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దామన్నారు. కాగితాలకే పరిమితం కాకుండా... క్షేత్ర స్థాయిలో సంక్షేమాన్ని అమలు చేయడమే లక్ష్యంగాబడ్జెట్ రూపొందించామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

# పెర్ఫామెన్స్ వీక్, పబ్లిసిటీ పీక్

అమరావతి కూటమి ప్రభుత్వ పనితీరు 'పెర్ఫామెన్స్ వీక్, పబ్లిసిటీ పీక్' అన్నట్టుగా ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు. బడ్జెట్ పుస్తకంలో బొమ్మలు తప్ప అసలు ఆదాయాలు, ఖర్చుల స్పష్టమైన వివరాలు లేవని ఆరోపించారు. ఏపీ బ్జడెట్ 2026-27పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు . ఇప్పటికే రూ.3.12 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారని, కానీ రాష్ట్ర మొత్తం అప్పులపై స్పష్టత ఇవ్వలేదని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని, బ్జడెట్‌లో చెప్పిన అనేక అంశాలు ఊహాగానాలేనని విమర్శించారు.రూ.90 వేల కోట్లకంటే ఎక్కువ ఆదాయం వచ్చే పరిస్థితి లేకపోయినా, 60 శాతం పెరిగినట్టు అంచనాలు చూపిస్తున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు ఎంత నిధులు కేటాయించారో వెల్లడించలేదని ప్రశ్నించారు బుగ్గన.. తమ హయాంలో గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, నాడు-నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, పోర్టులు నిర్మించామని గుర్తుచేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులకు పలు పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించామని తెలిపారు.కాగ్ నివేదికల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారలేదని, కేంద్రం కంటే ఆదాయ వృద్ధి ఎక్కువగా ఉందని చెప్పారు బుగ్గన? జల జీవన్ మిషన్ కింద ఖర్చు చేసిన నిధులపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి హామీలకు తగిన కేటాయింపులు లేవని



ఆరోపించారు. ఉద్యోగుల బకాయిలు రూ.40 వేల కోట్లకు చేరుకున్నాయని పేర్కొన్నారు. మొత్తం మీద ఈ బ్జడెట్ ప్రజాశ్రేయస్సుకు తోడ్పడేలా లేదని, ఇది 'అనాలసిస్ ఆఫ్ బ్జడెట్' కంటే 'అనాలసిస్ ఆఫ్ అబద్దాలు'గా మారిందని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. బ్జడెట్ అనేది ప్రజాశ్రేయస్సుకు తోడ్పడే విధంగా, పద్ధతిగా అధ్యయనం చేసి రూపొందించాలి. కానీ ఈసారి కూటమి ప్రభుత్వం ఇచ్చిన బ్జడెట్‌లో అంతటి లోతైన విశ్లేషణ లేకుండా ఊహాజనితమైన లెక్కలతో మాత్రమే ఏర్పాటుచేయబడిందని విమర్శించారు బుగ్గన.. అసలు ఆదాయాలు, అప్పుల వివరాలను బ్జడెట్‌లో చూపించకపోవడం ప్రజలకు గందరగోళాన్ని సృష్టిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ అప్పులను 'మట్కా నంబర్ల' మాదిరిగా చూపిస్తూ అసత్యాలు ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెప్పడం పెద్ద నేరమని, కానీ ఈ ప్రభుత్వం బ్జడెట్‌లో కూడా నిజాలను చెప్పలేదని బుగ్గన హెచ్చరించారు. ఈ పరిస్థితిలో ఆయన 'అనాలసిస్ ఆఫ్ బ్జడెట్' కాదు, 'అనాలసిస్ ఆఫ్ అబద్దాలు' చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి..

## బడ్జెట్ అంతా అంకెట గారడీ

అమరావతి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ బ్జడెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శాసనమండలి మీడియా పాయింట్‌లో మాట్లాడిన ఆయన, ఈ బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చలేదని ఆరోపించారు. బడ్జెట్ కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారని, కానీ 1 నుంచి 8 పేజీల వరకూ ప్రభుత్వం తమను తాము పొగడుకోవడానికే, గత ప్రభుత్వాన్ని విమర్శించ డానికే ఉపయోగించిందని అన్నారు బొత్స? ప్రజలు అభివృద్ధి కోసం అధికారం ఇచ్చారని, కానీ బ్జడెట్‌లో మాత్రం అభివృద్ధి కంటే పేర్ల ప్రస్తావనలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ పేర్లే పదేపదే ప్రస్తావించారని.. వాళ్ల డబ్బా కొట్టుకున్నారని బొత్స ఆరోపించారు. రైతులకు మద్దతు ధరపై ఎక్కడా స్పష్టత లేదని, సున్నా వడ్డీ రుణాలపై కేటాయింపులు కనిపించడం లేదని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సున్నా వడ్డీ రుణాలు సమయానికి అందించామని, ఇప్పుడు వాటి ఊసే లేదని అన్నారు. పనికి ఆహార పథకానికి తగిన కేటాయింపులు లేవని కూడా విమర్శించారు. అప్పుల విషయంలో ప్రభుత్వం గణాంకాలతో గారడీ చేస్తోందని ఆరోపించారు బొత్స.. గత వైసీపీ హయాంలో రూ.3 లక్షల 20 వేల కోట్లు మాత్రమే అప్పులు చేశామని మీరే చెప్పారని, ఇప్పుడు రూ.9 లక్షల కోట్లు చేశారని చెప్పడం అబద్ధమని అన్నారు. ఈ 20 నెలల కాలంలో 20 లక్షల ఐడెంటిటీ కార్డులు ఇచ్చామని చెబుతున్నా, ఒక్క కౌలు రైతుకైనా నష్టపరిహారం అందించారా అని ప్రశ్నించారు. ఈ బ్జడెట్ వల్ల సమాజంలోని ఏ వర్గానికీ ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఈ అంశాలన్నింటిపై మండలిలో పోరాడతామని, అధికార పక్షాన్ని నిలదీసి సమాధానాలు రాబడతామని స్పష్టం చేశారు. దేవదేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని చెప్పినా, ఇప్పుడు అదే విషయంపై అధికార పక్షం డిఫెన్స్‌లో పడిందని బొత్స వ్యాఖ్యానించారు. మొత్తానికి, ఈ బ్జడెట్ అంకెల గారడీతో నిండిపోయిందని, ప్రజలకు ఉపయోగపడే స్పష్టమైన ప్రణాళికలు లేవని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

## రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

## ఫార్ములా-ఈ కార్ రేసులో కీలక పరిణామం

### ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు అనుమతి

హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి లభించింది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా-ఈ రేసింగ్ ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారించడానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పుడు ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ పొందింది. కాగా, ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ ఉన్నారు.

# విచారించండి

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఫోన్ ట్యాపింగ్, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలతో తెలంగాణలో రాజకీయాలు హీటెక్కిన విషయం తెలిసిందే. ఫార్మూలా ఈ రేసింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. ఇప్పటికే దీనిలో కేటీఆర్ ను పలు మార్లు అధికారులు విచారించారు. తాజాగా.. ఈ కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ను విచారించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫార్మూల్ ఈ రేసింగ్ లో భారీగా డబ్బులు అడ్డగోలుగా చేతులు మారాయని అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారణకు గతంలోనే తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతిని ఇచ్చారు. తాజాగా సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇచ్చింది. దీంతో ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతుంది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 , ఏ5గా ఎఫ్ఈవో ప్రతినిధులు ఉన్నారని తుది నివేదికలో స్పష్టం చేసింది. క్విడ్ ప్రో కో జరిగిందని అధికారులు ఆరోపణలు చేశారు. ట్రైపార్టీ అగ్రిమెంట్ కు ముందే బీఆర్ఎస్ కు ఈ బాండ్లు చెల్లించారని ఏసీబీ ఆరోపించింది. కేటీఆర్ సైతం ఇప్పటికే ఫార్ములా ఈ అనే అంశాన్ని ప్రభుత్వం తెర మీదికి తీసుకొస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు పిలిచి వాళ్లు చేసింది ఏమీ లేదన్నారు. కేవలం మరోసారి వేధింపులలో భాగంగా పిలవబోతున్నారన్న సమాచారం ఉందన్నారు. ఎన్ని సార్లు పిలిచినా భయపడేది లేదని, సత్యమే చెప్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



**ఫార్మూలా ఈ రేస్ లో కీలక పరిణామం..**

**ప్రాసిక్యూషన్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**అర్వింద్ కుమార్ ను విచారణకు పిలుపు**

# ప్రభుత్వ బ్యాంక్ శుభవార్త.. పెరిగిన వడ్డీ రేట్లు..



దిగ్గజ ప్రభుత్వ బ్యాంకుల్లో ఒకటి కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించింది. తక్కువ కాల వ్యవధులపై వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు నిర్ణయం తీసుకుంది. ఇది డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు బ్యాంక్ తన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. మరి ఇప్పుడు ఏయే టెన్యూర్లపై వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

లీడింగ్ పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. తన కస్టమర్లు సహా జనరల్ సిటిజెన్స్‌కు గుడ్‌న్యూస్ చెప్పింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు పెంచేసింది. రూ. 2 కోట్ల కంటే తక్కువ డిపాజిట్లపై అదే విధంగా.. రూ. 2 కోట్ల నుంచి రూ. 10 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఈ పెరిగిన వడ్డీ రేట్లు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం 2023, డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. బ్యాంకు ఎక్కువ టెన్యూర్ ఉన్న కాల వ్యవధులపై కాకుండా.. తక్కువ (షార్టర్ పీరియడ్) ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌కు సంబంధించి వడ్డీ రేట్లు పెంచింది. వీటిల్లో ఏ కాలపరిమితులపై ఎలా వడ్డీ ఇస్తుందో మనం చూద్దాం. రూ. 2 కోట్ల కంటే ఎక్కువ వ్యవధి డిపాజిట్లపై.. 46 నుంచి 90 రోజుల టెన్యూర్ ఉన్న పై వడ్డీ రేట్లను 5.25 శాతానికి చేర్చింది. 91 రోజుల నుంచి 179 రోజుల వ్యవధి ఉన్న ఎఫ్‌డీలపై 6 శాతానికి పెంచడం విశేషం. 180 రోజుల నుంచి 210 రోజుల వరకు కాలవ్యవధి ఉన్న బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 6.25 శాతానికి ఇదే సమయంలో 211 రోజుల నుంచి ఏడాది లోపు వ్యవధి ఉన్న డిపాజిట్లపై 6.50 శాతానికి వడ్డీ రేట్లను చేర్చింది. ఏడాది టెన్యూర్‌పై 7.25 శాతం వడ్డీ రేటు అమలు చేస్తోంది.

రూ. 2 కోట్ల కంటే తక్కువ డిపాజిట్స్‌పై రెండేళ్ల వ్యవధి ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లను పెంచింది. దీని కింద సూపర్ సీనియర్ సిటిజెన్లకు అత్యధికంగా 7.9 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. సీనియర్ సిటిజెన్లకు 7.75 శాతం, సాధారణ ప్రజలకు 7.25 శాతం వడ్డీ వస్తుంది. ఈ వడ్డీ రేట్లను ఇతర బ్యాంకులతో పోల్చి చూద్దాం.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అక్టోబర్ 1న చివరిసారిగా వడ్డీ రేట్లను సవరించింది. ఇక్కడ వారం నుంచి పదేళ్ల వ్యవధి డిపాజిట్లపై సాధారణ ప్రజలకు 3 శాతం నుంచి 7.20 శాతం వరకు వడ్డీ ఇస్తోంది. సీనియర్ సిటిజెన్లకు 3.50 శాతం నుంచి 7.75 శాతంగా ఉంది. ఎస్‌బీఐలో వడ్డీ రేట్లు ఫిబ్రవరి 15 నుంచి స్థిరంగా ఉన్నాయి. అక్కడ జనరల్ పబ్లిక్‌కు 3 నుంచి 7.10 శాతం వడ్డీ రేట్లు ఉండగా.. సీనియర్ సిటిజెన్లకు అదనంగా 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ వస్తుంది. ఇక యెస్ బ్యాంకులో చూసినట్లయితే ఇక్కడ సాధారణ ప్రజలకు 3.25 శాతం నుంచి 7.75 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇక సీనియర్ సిటిజెన్లకు ఇది 3.75 శాతం నుంచి 8.25 శాతంగా ఉంది. నవంబర్ 21 న చివరిసారి ఈ వడ్డీ రేట్లను సవరించింది బ్యాంక్.

# తులం బంగారానికి లోన్ ఎంతొస్తుంది..



బ్యాంకులు బంగారంపై లోన్ ఇవ్వడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తాయి. బంగారం తాకట్టు ఉంటుంది కాబట్టి సురక్షితమైన లోన్‌గా పరిగణిస్తాయి. ఎమర్జెన్సీగా డబ్బులు అవసరమైనప్పుడు వేగంగా లోన్ మంజూరయ్యే మార్గాల్లో గోల్డ్ లోన్ ఒకటిగా చెప్పవచ్చు. అయితే, గోల్డ్ లోన్ తీసుకునే ముందే కొన్ని విషయాలు తెలుసుకోవాలి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై బ్యాంకులు ఎంత రుణం ఇస్తాయి? వడ్డీ రేట్లు ఎంతుండొచ్చు? ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి అనే అంశాలను ఓసారి తెలుసుకుందాం. చిన్న వ్యాపారుల వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టి లోన్ తీసుకోవడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండడమే కాకుండా, మీ బంగారానికి భద్రత కూడా తక్కువే. అందువల్ల బంగారంపా రుణాలను పొందేందుకు బ్యాంకు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలను ఎంచుకోవడం మంచిది. వీటిలో ప్రాసెసింగ్ ఫీ ఉంటుందని గుర్తుంచుకోవాలి.

**10 గ్రాములకు ఎంత లోన్ ఇస్తారు?**

సాధారణంగా బ్యాంకులు 18 క్యారెట్ల నుంచి 24 క్యారెట్ల బంగారాన్ని తాకట్టుగా పెట్టుకుని లోన్ ఇస్తాయి. బంగారం విలువ కట్టేటప్పుడు ఆభరణాలపై ఉండే రాళ్లు, డిజైన్లను పరిగణనలోకి తీసుకోరు. బ్యాంకులు, బంగారం విలువపై 60 శాతం నుంచి 90 శాతం వరకు లోన్ వస్తుంది. అయితే, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు బ్యాంకులో తనఖా పెట్టాలనుకున్నప్పుడు గరిష్ఠం స్థాయిలో లోన్ ఇచ్చేందుకు బ్యాంకులు మొగ్గు చూపుతాయి. బంగారం విలువలో 90 శాతం వరకు లోన్ రావచ్చు. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.64 వేల పైన ఉంది. 90 శాతం లోన్ ఇస్తే మీకు రూ.57 వేల వరకు లోన్ వస్తుంది. అయితే, బంగారం రేటు రోజు రోజు మారుతుంది కాబట్టి మీరు తీసుకునే సమయంలో ఉన్న విలువ ఆధారంగా లెక్కించుకోవాల్సి ఉంటుంది. కొన్ని బ్యాంకులు 60 శాతమే ఇవ్వొచ్చు.

వడ్డీ రేట్లు.. బ్యాంకులు ఎన్‌బీఎఫ్‌సీలు బంగారు రుణాలపై 8 నుంచి 26 శాతం వరకు వడ్డీ రేట్లను వసూలు చేస్తుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ బ్యాంకులు, వ్యవసాయ ఖర్చుల కోసం తక్కువ వడ్డీ రేటుకే బంగారు రుణాలు ఇస్తాయి. అయితే, రుణ గ్రహీతలు వారి పేరు మీద ఉన్న భూమి శిస్తు రశీదులు చూపెట్టాలి. ఇతర రుణాలపై బ్యాంకులు చక్రవడ్డీ వసూలు చేస్తాయి. బంగారు రుణాలపై సాధారణ వడ్డీ మాత్రమే వసూలు చేస్తాయి. రుణ బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లించకపోతే బ్యాంకులు వివిధ మార్గాల ద్వారా నోటీసులు పంపిస్తాయి. వాటికి గడువు తేదీలోగా స్పందించకపోతే బంగారాన్ని వేలం వేస్తాయి.

# రూ.4 లక్షల కోట్లు పెరిగిన సంపద!



దేశీయ బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు సోమవారం ఆరంభం నుంచే జోష్ లో కొనసాగుతున్నాయి. బాంబే ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ ఒక స్థాయిలో 1000 పాయింట్ల మేర పెరిగింద. కీలక రాష్ట్రాల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం మార్కెట్లలో జోష్ నింపినట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. సెన్సెక్స్ మధ్యాహ్నం 1 గంట సమయంలో 1033 పాయింట్లు పెరిగి 68,514 మార్క్ వద్ద ట్రేడింగ్ అవుతోంది. ఇక నిఫ్టీ 50 ఇండెక్స్ సూచీ 317 పాయింట్లు లాభపడి 20,585 మార్క్ పై కొనసాగుతోంది.

రూ.4 లక్షల కోట్లు.. స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో కొనసాగుతున్న క్రమంలో బీఎస్ఈలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ కేవలం 15 నిమిషాల్లోనే రూ. 4.09 లక్షల కోట్లు పెరిగింది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ. 341.76 లక్షల కోట్లకు చేరింది. డిసెంబర్ 3వ తేదీన నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సెన్సెక్స్‌లో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్అండ్ టీ, ఎన్‌టీపీసీ, ఎయిర్ టెల్ టాప్ గెయినర్స్ గా ఉన్నాయి. దాదాపు 2 శాతానికిపైగా లాభపడ్డాయి. మరోవైపు.. ఎంఅండ్ఎం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ సైతం మంచి లాభాల్లో కొనసాగుతున్నాయి. నెస్లే మాత్రమే నష్టాల్లో ప్రారంభమైంది. ఇదే సమయంలో అదానీ గ్రూప్ కంపెనీల స్టాక్స్ 14 శాతం మేర పెరిగాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 14 శాతం, అదాని పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ 12 శాతం, అదాని ఎంటర్ ప్రైజెస్, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మార్ 6- 8 శాతం మేర పెరిగాయి.

కారణాలు ఇవే.. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించింది. మార్కెట్లు ఎక్కువల రాజకీయ స్థిరాత్వాన్ని కోరుకుంటాయని, మరోసారి మోడీ సర్కార్ వచ్చే సూచనలతో మార్కెట్లు దూసుకెళ్తున్నట్లు నిపుణులు పేర్కొన్నాయి. మరోవైపు.. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం కూడా కలిసి వచ్చింది. యూఎస్ ఫెడరల్ బ్యాంక్ మరోసారి వడ్డీ రేట్ల పెంపు సూచనలతో ట్రెజరీ యీల్డ్ కనిష్ట స్థాయికి పడిపోయాయి. మరోవైపు.. శుక్రవారం రూ. 1,589 కోట్లు విదేశీ మదుపరులు ఇన్వెస్ట్ చేయడం కలిసొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధర 80 డాలర్ల కిందకు రావడం కూడా సానుకూలంగా మారినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# కొత్త సర్వీసులు.. ఫీచర్స్, బెనిఫిట్స్ ఇవే..

ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనితో ఇకపై సులభంగా పేమెంట్లు చేయొచ్చు. ఈ సర్వీసుల్ని ఉచితంగానే పొందొచ్చు కూడా. ఎస్‌బీఐకి దేశవ్యాప్తంగా కోట్లాది మంది కస్టమర్లు ఉన్న సంగతి తెలిసిందే.

దిగ్గజ ప్రభుత్వ రంగ బ్యాంకు, అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన భారతీయ స్టేట్ బ్యాంక్.. తాజాగా తన కస్టమర్లకు శుభవార్త చెప్పింది. కొత్త సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వల్ల చాలా మందికి ఊరట కలుగుతుందని చెప్పొచ్చు. ఇంతకీ ఈ బ్యాంక్ ఏ సర్వీసుల్ని తీసుకొచ్చిందనేది మనం ఇప్పుడు చూద్దాం.

తాజాగా ఎస్‌బీఐ.. వర్చువల్ డెబిట్ కార్డు సర్వీసుల్ని అందుబాటులోకి తెచ్చింది. యోనో కస్టమర్లు ఇకపై ఈ సర్వీసుల్ని ఇప్పుడు ఇంటి దగ్గరి నుంచే పొందొచ్చు. యోనో యాప్ ద్వారా ఈ వర్చువల్ డెబిట్ కార్డును కూడా పొందొచ్చు. ఫిజికల్ డెబిట్ కార్డు కోసం బ్యాంకుకు వెళ్లే పని లేకుండానే.. ఆన్‌లైన్‌లో ఈజీగా వర్చువల్ డెబిట్ కార్డు వస్తుంది. ఈ డెబిట్ కార్డు ఎలా పొందాలి? దీనితో కలిగే బెనిఫిట్స్ ఏంటి.. అనేది తెలుసుకోవడం ముఖ్యం. ఆ వివరాల్ని ఇప్పుడు తెలుసుకుందాం. మీరు ఎస్‌బీఐకి చెందిన యోనో యాప్ వాడుతున్నారా? ఈ యాప్‌తో తక్షణమే వర్చువల్ డెబిట్ కార్డు జనరేట్ చేసుకోవచ్చు. దాని




ద్వారా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్స్ నిర్వహించుకోవచ్చు. అలాగే కాంటాక్ట్‌లెస్ పేమెంట్స్ కూడా చేయొచ్చు. ఇంకా కార్డు యూసేజ్ కస్టమైజ్ చేసుకోవచ్చు. లిమిట్ సెట్ చేసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. రూపే, వీసా, మాస్టర్ కార్డ్ ఆప్షన్లలో లభిస్తుంది. మీరు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా ఈ వర్చువల్ డెబిట్ కార్డు వినియోగించుకోవచ్చు.

ఈ వర్చువల్ డెబిట్ కార్డ్ క్షణాల్లో వస్తుంది. ఇ-కామర్స్ లావాదేవీల కోసం దీనిని ఉపయోగించుకోవచ్చు. కాంటాక్ట్ లెస్ పేమెంట్స్ చేసుకోవచ్చు. ట్రాన్సాక్షన్లను కూడా మొబైల్ ద్వారా చెల్లించవచ్చు. జీరో ఇష్యూయెన్స్ ఫీజు బెనిఫిట్ ఉంది. వార్షిక మెయింటెనెన్స్ ఛార్జీలు కూడా లేవు. ఎకో ఫ్రెండ్లీగా ఉంటుంది. మీరు యోనో యాప్ ఉపయోగిస్తున్నట్లయితే.. ఈ వర్చువల్ డెబిట్ కార్డ్ సేవలు పొందొచ్చు. ఎప్పుడు కావాలన్నా అప్పుడు ఈ సేవలు పొందే వీలుంటుంది. క్షణాల్లోనే కార్డును జనరేట్ చేసుకోవచ్చు.

# రాజస్థాన్ సీఎం రేసులో మరో 'యోగి'.. ఎవరీ బాబా?



రెండోసారి వరుసగా ఏ పార్టీకి అధికారం ఇవ్వని రాజస్థాన్ ఈ సంప్రదాయాన్ని మార్చాలనే పట్టుదలతో అన్నీ తానై కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించి, తాను ప్రవేశపెట్టిన పథకాలే మళ్లీ అధికారాన్ని కట్టబెడతాయని అతి విశ్వాసంతో వెళ్లిన అశోక్ గెహ్లాట్ బొక్క బోర్లా పడ్డారు. సీఎం పదవిని కాపాడుకోడానికి ఆయన ఏడాది కాలంగా ఆయన చేసిన విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఆయన ఒంటెద్దు పోకడలే పార్టీని పుట్టి ముంచిందని అంటున్నారు.

సార్వత్రిక సమరానికి సెమీఫైనల్స్‌గా భావిస్తూ వచ్చిన శాసనసభ ఎన్నికల్లో హిందీ రాష్ట్రాల్లో కాషాయ జెండా రెపరెపలాడింది. మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని నిలబెట్టుకున్న బీజేపీ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్‌ను గద్దె దించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోతోంది. రాజస్థాన్‌లో ఏ పార్టీ వరుసగా రెండోసారి అధికారంలోకి రాదనే సంప్రదాయం ఈసారి కూడా కొనసాగింది. అయితే, రాజస్థాన్‌లో ముఖ్యమంత్రిగా బీజేపీ ఎవరిని నియమిస్తుందనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఎం రేసులో పలువురు నాయకులు ఉండటమే దీనికి కారణం. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, బాబా బాలక్‌నాథ్, దియా కుమారి, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ రామ్ మేఘవాలే పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, ఉత్తర్ ప్రదేశ్ మాదిరిగా మరో యోగి పేరు తెరపైకి వచ్చింది. యోగి ఆఫ్ రాజస్థాన్‌గా పేరు తెచ్చుకున్న బాబా బాలక్‌నాథ్ ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. ఆయన తిజారా అసెంబ్లీ స్థానం నుంచి విజయం సాధించారు. 40 ఏళ్ల బాలక్‌నాథ్ 1984లో బెహ్రోడ్‌లోని ఓ గ్రామంలో యాదవ కుటుంబంలో జన్మించారు. రోహ్‌తక్‌లోని మస్త్‌నాథ్ మఠానికి ఎనిమిదో మహంత్. బాలక్‌నాథ్ తరఫున ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం నిర్వహించారు. అయితే, బాలక్‌నాథ్ వివాదాలతోనూ వార్తల్లో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్ ఖాన్‌తో పోటీని 'భారత్ - పాకిస్థాన్' మ్యాచ్‌తో పోల్చి వివాదంలో ఇరుకున్నారు. 'ఈ సమయం భారత్-పాకిస్థాన్ మ్యాచ్ లాంటింది.. కేవలం విజయం కోసమే తలపడటం కాదు.. ఓటింగ్ శాతం కూడా పెంచుకోవాలి'అన్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అల్వార్ ఎంపీ అయిన బాలక్‌నాథ్‌కు ఒకవేళ రాజస్థాన్ పగ్గాలు అప్పగిస్తే.. యోగి ఆధిత్యనాథ్ తర్వాత సీఎం పదవిని అధిష్ఠించిన రెండో సన్యాసి అవుతారు. సీఎం రేసులో మీరు ఉన్నారా? అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'మా ప్రధాని బీజేపీకి ప్రధాన ఆకర్షణ.. ఆయన నాయకత్వంలో మేము పని చేస్తూనే ఉంటాం. ముఖ్యమంత్రి ఎవరనేది కూడా పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. నేను ఎంపీగా సంతోషంగా ఉన్నాను.. సమాజానికి సేవ చేయాలనుకుంటున్నాను.. దానితో నేను చాలా సంతృప్తిగా ఉన్నాను' అని సమాధానం ఇచ్చారు. ఆయనతోపాటు రాజస్థాన్‌కు తొలి మహిళా ముఖ్యమంత్రిగా సేవలందించిన వసుంధర రాజే, జైపూర్ రాజకుటుంబానికి చెందిన దియా కుమారి కూడా సీఎం ఆశావహుల జాబితాలో ఉన్నారు. 2013లో బీజేపీలో చేరినప్పటి నుంచి దియా వరుసగా మూడుసార్లు సవాయ్ మాధోపూర్ నియోజక వర్గం నుంచి విజయం సాధించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంలో ఆమె అనేక అభివృద్ధి పనులు చేపట్టి మంచి పేరు తెచ్చుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 5 లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఎంపీగా గెలుపొందారు. వీరు మాత్రమే కాకుండా గజేం ద్ర సింగ్ షెకావత్, కిరోరీ మాల్ మీనా, సీపీ జోషీ కూడా ముఖ్య మంత్ర పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

# నిరాశకు గురిచేసిన ఫలితాలు


ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్న సీఎం భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నట్లు కనిపించినా.. ఓటర్లు మాత్రం కాషాయ పార్టీకే స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. కాంగ్రెస్‌పై అవినీతి, నిరుద్యోగం వంటి అస్త్రాలతో బరిలోకి దిగి బీజేపీ వాటిని సరిగ్గా వాడుకుని సఫలీకృతమైంది. 2018లో 68 సీట్లతో కాంగ్రెస్ అధికారాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో సగం స్థానాలకు పడిపోయింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోనూ ఆ పార్టీ పరిస్థితి దారుణంగా ఉంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ తప్ప మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి ఊహించని పరాభవం ఎదురయ్యింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని భావిస్తోన్న కాంగ్రెస్‌కు నిరాశను మిగిల్చాయి. మూడు రాష్ట్రాల విషయానికి వస్తే మధ్యప్రదేశ్‌లో అధికారం తమదేనని నమ్మకంతో ఉన్న కాంగ్రెస్‌కు అక్కడ ఫలితాలు ఆ పార్టీకి మింగుడపడటం లేదు. గత ఎన్నికల్లో బొటాబొటి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్‌కు జ్యోతిరాదిత్య సింధియా ఝలక్ ఇచ్చారు. తన వర్గానికి చెందిన 21 మంది ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుబాటు చేశారు. దీంతో 14 నెలల్లోనే కమల్‌నాథ్ సర్కారు కూలిపోగా.. మళ్లీ అక్కడ బీజేపీ అధికారం చేపట్టింది.




బీజేపీ కుట్రలతోనే తమ ప్రభుత్వం కూలిపోయిందని, ఈసారి స్పష్ట మైన మెజార్టీతో అధికారం చేపడ తామని కాంగ్రెస్ నాయకులు అతివిశ్వాసం ప్రదర్శించారు. కానీ, బీజేపీ వ్యూహాలకు హస్తం నేతలు చిత్తయ్యారు. అనూహ్యంగా కేంద్ర మంత్రులను, ఎంపీలను పోటీకి నిలిపి.. స్థానిక నేతల్లో ఉన్న విబేధాలను సమసిపోయేలా చేసింది. ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించే దిశగా అనేక హామీలు ఇచ్చింది. గోధుమలు కనీస మద్దతు రూ.2,700, ధాన్యానికి రూ. 3,100 కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆడపిల్లలకు పీజీ వరకూ ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించింది. లాడ్లీ బెహ్నా పథకం కింద 450 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్న కమలం పార్టీ.. ఐదేళ్లపాటు పేదలందరికీ ఉచితంగా రేషన్ అందిస్తామని తెలిపింది. ఇవన్నీ కలిసి కాషాయ పార్టీ విజయానికి దోహదం చేశాయి. ఇక, రాజస్థాన్‌లో ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయం కొనసాగింది. కానీ, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ మధ్య వర్గపోరుకు కాంగ్రెస్ మూల్యం చెల్లించుకుంది. కాంగ్రెస్ సర్కారు చేపట్టిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం, ఆరోగ్య బీమా పథకం వంటి సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో సానుకూలత ఉన్నా.. వాటిని ఓట్లగా మలచుకోవడంలో ఆ పార్టీ విఫలమైంది. ఇక, వర్గపోరును బయటపడనీయ కుండా బీజేపీ తెలివిగా వ్యవహరించింది. ఆ విషయంలో కమలం పార్టీ సఫలమైంది.

# చెన్నైను వణికిస్తోన్న మిచౌంగ్..

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా బలపడి తుఫానుగా మారింది. ఇది గంటకు 14 కి.మీ. వేగంతో వాయువ్య దిశగా పయనిస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, బాపట్ల, చెన్నైకు తూర్పు-ఆగ్నేయంగా 180 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడుతుంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఆంధ్ర, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని డిసెంబర్ 4 మధ్యాహ్నానికి తీరానికి చేరువగా రానుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని దాదాపు ఉత్తరం వైపు కదులుతుంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాను తీవ్ర రూపం దాల్చింది. దీని ప్రభావంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిల్లో గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చెన్నై నగరంలోని పలు ప్రాంతాలు నీటిమునిగాయి. రైల్వే సబ్‌వేల్లోకి నీరు చేరడంతో ముందజాగ్రత్తగా వాటిని మూసివేశారు. చెన్నై, చుట్టుపక్కల జిల్లాల్లో మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ఐఎండీ హెచ్చరికలతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. తాంబ్రం ప్రాంతంలో నీటిలో చిక్కుకున్న 15 మందిని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. బాసిన్ బ్రిడ్జ్, వ్యాసర్‌పాడి మధ్య 14వ నెంబరు వంతెనను అధికారులు మూసివేశారు. విద్యా సంస్థలతో పాటు న్యాయస్థానాలకు సెలవు ప్రకటించారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను దక్షిణ రైల్వే రద్దుచేసింది. చెన్నై-మైసూర్ శతాబ్ది, కోయంబత్తూర్- కోవై, కోయంబత్తూర్ శతాబ్ది, బెంగళూరు ఏసీ డబుల్ డెక్కర్, బెంగళూరు బృందావన్, తిరుపతి సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం రద్దు చేసినట్టు వెల్లడించింది. అలాగే, సబర్బన్ రైళ్లను కూడా రద్దు చేసినట్టు పేర్కొంది. చెన్నైలోని పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.





వలసరవాకం 154 మి.మీ. నుంగంబాకంలో 101 మీ.మీ., చోలింగన ల్లూరులో 125 మీ.మీ., కోడంబాకంలో 123 మీ.మీ., మీనంబాకంలో 108 మీ.మీ. వర్షపాతం నమోదైంది. కాంచీపురం, చెంగల్‌పట్టు, తిరువల్లూరు జిల్లాలను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. చెన్నైలోని కాంతూరు ప్రాంతంలో గోడ కూలి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కిల్పాకం మెడికల్ కాలేజీ ఆస్పత్రి ఓపీ విభాగంలోకి వరద చేరింది. ముందుజాగ్రత్తగా మొత్తం 2,800 బస్సుల్లో కేవలం 600 మాత్రమే చెన్నై మెట్రో కార్పొరేషన్ తిప్పుతోంది. చాలా మంది సిబ్బంది విధులకు హాజరుకాలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అటు, కోయంబత్తూరు-చెన్నై మధ్య రెండు విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఇండిగో ప్రకటించింది. చాలా విమానాలను బెంగళూరుకు దారి మళ్లించారు. ఇప్పటి వరకు దాదాపు 11 విమానాలను దారి మళ్లించినట్లు తెలుస్తోంది.

# అధికారం దిశగా ప్రతిపక్షం





ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మిజోరాంలో ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈసీ సోమవారానికి వాయిదా వేసింది. వాస్తవానికి నిర్ణయించిన డిసెంబర్ 3న మిగతా నాలుగు రాష్ట్రాలైన తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లతో పాటు అక్కడ లెక్కింపు నిర్వహించాల్సి ఉంది. కానీ, పెద్ద సంఖ్యలో క్రైస్తవులున్న ఈశాన్య రాష్ట్రంలో ఆదివారానికి ఎంతో ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని, ప్రత్యేక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్‌ను వాయిదా వేయాలని పలువురు కోరారు. ఈశాన్య రాష్ట్రం మిజోరాంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలుకాగా.. ప్రతిపక్ష జోరామ్ పీపుల్స్ మూమెంట్ ఆధిక్యం ప్రదర్శిస్తోంది. షెడ్యూల్ ప్రకారమే మిగతా నాలుగు రాష్ట్రాలతో కలిసి డిసెంబరు 3నే ఓట్ల లెక్కింపు చేపట్టాల్సి ఉంది. కానీ, క్రైస్తవులకు ఎంతో ప్రత్యేకమైన రోజున లెక్కింపు చేపట్టవద్దని కొన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని డిసెంబరు 4కు ఈసీ వాయిదా వేసింది. ప్రస్తుత ఫలితాల సరళిని బట్టి అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) దారుణంగా వెనుకబడింది. ఐజ్వాల్ ఈస్ట్ నుంచి బరిలో ఉన్న సీఎం జోరాంతంగ వెనుకంజలో ఉన్నారు. మిజోరాంలో వరుసగా రెండోసారి అధికార పార్టీకి ఓటర్లు పట్టం కట్టే సంప్రదాయం కొనసాగుతుంది. కానీ, ఈసారి ఆ సంప్రదాయాన్ని అధిగమించి లాల్దుహోమా నేతృత్వం లోని జోరామ్ పీపుల్స్ మూమెంట్ అధికారం దిశగా సాగుతోంది. మొత్తం 40 స్థానాలున్న మిజోరాంలో జెడ్‌పీఎం ఏకంగా 28 చోట్ల ఆధిక్యంలో ఉండగా... అధికార ఎంఎన్ఎఫ్ 8, బీజేపీ 3, కాంగ్రెస్ ఒక స్థానంలో ఆధిక్యంలో ఉన్నాయి. ఇక్కడ గతంలో ఒకే సీటు గెలుచుకున్న బీజేపీ ఈసారి మెరుగైన ఫలితాన్ని సాధించే అవకాశం ఉంది. సెర్చిప్ నుంచి జెడ్‌పీఎం అధినేత లాల్దుహోమా ఆధిక్యంలో ఉన్నారు. కాగా, ఇండియా టుడే యాక్సిస్-మై ఇండియా ఎగ్జిట్ పోల్ తప్ప మిగతావ న్నీ అక్కడ హంగ్ వస్తుందని అంచనా వేశాయి. కానీ, ఇండియా టుడే సర్వే మాత్రం మిజోరంలో క్లీన్ స్వీప్ చేస్తుందని అంచనా వేసింది. ప్రస్తుతం ఫలితాలు కూడా దీనికి దగ్గరగానే ఉన్నాయి. సీట్లు, 7, కాంగ్రెస్ 2-4, బీజేపీ 0-2 సీట్లు సాధిస్తుందని అంచనా వేసింది. గత ఎన్నికల్లో జోరాం తంగ నాయకత్వంలోని ఎంఎన్ఎఫ్ 26 సీట్లు గెలుచు కుని కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసింది. జెడ్‌పీ ఎం ఎనిమిది స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రె స్ దారుణ పరాజయం మూటగట్టుకుంది. 2013లో ఆ పార్టీ 34 స్థానాల్లో గెలవగా.. కేవలం 5 సీట్లతో సరిపెట్టుకుంది.

ఉత్తేజిత దినపత్రిక

# ఆంధ్రా ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కడప జోన్ 4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. టి. పి.రాఘవ కుమార్ కర్నూలు జిల్లాలో పర్యటన లో బాగంగా ఏ పి ఎస్ ఆర్ టి సి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఫిబ్రవరి 14 శనివారం ఏఏ ఎమ్మిగనూరు పట్టణ డిపో వచ్చారు. ఆయనను డిపో మేనేజర్ సి. మద్దిలేటి నాయుడు, ఎన్.ఎం. యు ఎమ్మిగనూరు డిపో కమిటీ,ఈ. యు. డిపో కమిటీ, ఆన్ కాల్ డ్రైవర్ లు శాలువాలతో పూలమాలలతో సత్కరించి ఘనంగా స్వాగతించారు. డిపో లో మొక్క నాటి డిపోలో పర్యటించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గారు బ్లాక్ స్మిత్ మెకానిక్ మరియు. ఏ. ఎం.ఎఫ్ బాలాంజనేయులు పై ఆగ్రహించారు. పని పై అవగాహనలేకుండా ఉన్నారని వీరిని మాస్టర్ క్లోజ్ చేసి కడప పంపండి అని డిపో మేనేజర్ గారికి ఆదేశించారు.ఆయన డిపో లో మెకానిక్ సెక్షన్, ఎలెక్ట్రిక్ సెక్షన్, టైరు సెక్షన్,లలో తిరిగి చూశారు. సీటు సెక్షన్ లో అస్తవ్యస్తంగా ఉన్న సామాన్లను చూసి టైలర్ సింగ్ కు వార్నింగ్ ఇచ్చారు. సంస్థ గురించి మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు అందరూ మనస్ఫూర్తిగా పనిచేయాలని కోరారు. శ్రీ శక్తి పథకం వచ్చినా కె. ఎం. పి.ఎల్ బాగానే తీస్తున్న డ్రైవర్లకు బెస్ట్ కె. ఎం. పి. ఎల్ అవార్డులను అందచేశారు. ఇందులో ఎస్. బి.నవాజ్, హెచ్. ఎస్ . సి.ఎం. బాబు ఉన్నారు. తదుపరి గవర్నమెంట్ టాయిలెట్ లను, బస్ స్టేషన్, ఎర్నింగ్ సెక్షన్లో పర్యటించారు. బస్ స్టేషన్ క్లీన్ చేసి ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, ఏ డి సి లు,రాజు,శేఖర్, సిస్టమ్ ఇంచార్జ్ ఖలీల్, ఏ. ఎం. ఎఫ్ బాలాంజనేయులు, టైర్ సెక్షన్ ఏ డి సి డి.ఎం.భాష, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఎమ్మిగనూరు డిపో కమిటీ, ఈ యు కమిటీ, ఆన్ కాల్ డ్రైవర్ లు కండక్టర్, డ్రైవరు లు, మెకానిక్ లు పాల్గొన్నారు.

# 23వ వార్డులో కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు వేగవంతం

**- ఎమ్మెల్యే బీవీతోనే వార్డుల అభివృద్ధి సాధ్యం**

**- జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులు పరిశీలన**

**- 23వ వార్డు టీడీపీ ఇంచార్జి సోమల**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి గూడూరు బాషా**





ఎమ్మిగనూరు ఫిబ్రవరి 14 శనివారం పట్టణంలో 23వ వార్డులో ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 1 కోటి 50 లక్షలతో వార్డులో తాగునీటి పైపులైన్ తోపాటు డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని 23వ వార్డు టీడీపీ ఇంచార్జి సోమల గూడూరు మహబూబ్ భాషా పేర్కొన్నారు. శనివారం వార్డులో జరుగుతున్న తాగునీటి పైపు లైన్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వార్డుకు పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డికు వార్డు ప్రజలు తాగునీటి పైపు లైన్ లేక ఇబ్బంది పడుతున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా గడిచిన 13 రోజులకే తాగునీటి పైపు లైన్ పనులను చేపట్టారని తెలిపారు. అలాగే మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీ ప్రాంతాల్లో పైపు లైన్ నిర్మాణనాలు చేపట్టారని తెలిపారు. తమ వార్డులో 1 కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో 23వ వార్డు ప్రజల తరపున ఎమ్మెల్యే బీవీకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు అభివృద్ధి చెందాలంటే ఒక్క బీవీ కుటుంబంతోనే సాధ్యం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. దింతో వార్డుల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగిడే నాగరాజు నేత తదితరులు పాల్గొన్నారు.

## బోడబండ పుణ్యక్షేత్రం నందు భక్తుల కొరకు ఉచిత అన్నదాన కార్యక్రమం

**నిర్వాహకులు పసుల శ్రీరాములు, ఈశ్వరమ్మ దంపతులు.**

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



తుగ్గలి మండల పరిధిలోని ఉప్పర్లపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని గల బోడబండ పుణ్యక్షేత్రం నందు 16వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బోడబండ పుణ్యక్షేత్రానికి విచ్చేసిన భక్తాదుల కొరకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మదనంతపురం గ్రామానికి చెందిన పసుల శ్రీరాములు,పసుల ఈశ్వరమ్మ దంపతులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా పకీరప్ప గురుస్వాములు, ఎల్లప్ప గురు స్వాములు, ఆంజనేయుల తాత దర్శనానికి విచ్చేసిన భక్తుల కొరకు ప్రతి ఏటా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని,ఈ శివరాత్రి రోజున కూడా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.చుట్టుపక్కల రాష్ట్రాలైన తెలంగాణ,కర్ణాటక నుండి కూడా భక్తులు విచ్చేస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్నదాన సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు.కావున భక్తాదులందరూ బోడబండ పుణ్యక్షేత్రం నందు గురుస్వాముల దర్శనానంతరం అన్నదాన కార్యక్రమం నందు భోజనాన్ని స్వీకరించి దేవుని కృపకు పాత్రులు కావాలని మదనంతపురం శ్రీరాముల దంపతులు తెలియజేశారు.

## నీతి నిజాయితీకి చిరునామా సంజీవయ్య....!

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి ఫిబ్రవరి 14**



-: నీతి నిజాయితీకి చిరునామాగా మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నిలిచారని మాల మహానాడు నాయకులు పబ్బతి శివ ప్రసాద్ కొనియాడారు. శనివారం పట్టణంలోని స్థానిక మాల మహానాడు కార్యాలయంలో దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటి తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అన్నారు .కర్నూలు జిల్లా పెదపాడు గ్రామంలో సుంకులమ్మ, మునయ్య దంపతులకు జన్మించిన ఆయన 38 ఏళ్ల అతిపిన్నవయసులో ఉమ్మడి ఏపీ సీఎం గా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు. కేంద్ర మంత్రిగా రెండుసార్లు ఏఐసిసి అధ్యక్షులు గా ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఏసీబీ వ్యవస్థ స్థాపన ,భూ పంపిణీ పెన్షన్ వంటి విప్లవత్మక సంస్కరణలు తెచ్చి అందరికీ పదవులు అనుభవించిన సొంత ఇల్లు కూడా లేదన్నారు .నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం. అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మాల మహానాడు ఉపాధ్యక్షులు నల్లమల్ల పుల్లన్న, నందికొట్కూరు మాల మహానాడు నాయకులు పడిగెల నాగేంద్ర, భూషణం, పాల మర్రి నాగరాజు, శ్రీనివాసులు పాత్రికేయులు, పెరుమాళ్ళ ఉషనాలం, డక్కా జమ్మలయ్య, పెడిసెల శ్రీనివాసులు రహమతుల్లా, కుమార్ ,నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేసే మెడికల్ మాఫియాను అరికట్టి

## ఔషధం పేరుతో విషం అమ్మే బోగస్ మెడిసిన్ కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ధర్నా: సిపిఐ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు ఫిబ్రవరి 14 శనివారం పట్టణంలో నియోజకవర్గంలో రాష్ట్రంలో ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేసే మెడికల్ మాఫియాను అరికట్టాలని ఔషధం పేరుతో విషం అమ్మే బోగస్ మెడిసిన్ కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం ఎమ్మిగనూరులో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో అనంతరం సోమప్ప సర్కిల్ లో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్ తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన మెడికల్ డ్రగ్స్ మాఫియా ను అరికట్టడంలో విఫలం చెందుతున్నాయని, విచ్చలవిడిగా నకిలీ మందులు అమ్ముతున్న వాటిని నియంత్రించడంలో పాలక ప్రభుత్వాలు ఎందుకు కృషి చేయడం లేదని వారు ప్రశ్నించారు. విదేశాలలో దశాబ్ద కాలం నిషేధించిన ఔషధాలను భారతదేశానికి దిగుమతి చేసుకొని డ్రగ్ కంట్రోల్ కమిషన్ ద్వారా అనుమతితో విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారని రాష్ట్రంలో 60 వేలు మందుల షాపులు కొనసాగుతున్నాయని అందులో బీఫార్మసీ,ఎం ఫార్మసీ చేసిన వారు 30 వేల మంది ఉన్నారని చెబుతున్నప్పటికీ స్పష్టత లేదని మరో 30 వేల మంది అనుభవం లేని వ్యక్తులు నిర్వహణ చేస్తున్నారని ఏ జబ్బుకు,ఏ మందులు ఇవ్వాలో తెలియక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఫార్మసీ విద్యార్థులకు సరైన ఉపాధి అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేదని, 4000 మందితో బోగస్ ఫార్మసీ సర్టిఫికెట్లు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం నిగ్గుతెల్చిందన్నారు. క్లినికల్ ల్యాబ్ ల పేరుతో ఏర్పాటు చేసుకున్న కొంత మంది వ్యక్తులు ఆర్ఎంపీ డాక్టర్లు అవతారం ఎత్తి ఎంబిబిఎస్ చేసిన వారి కంటే ఎక్కువ మందులు సూదులు వాడుతున్నారని ఎమ్మిగనూరు పట్టణంలో మెడికల్ ల్యాబ్ ల పరీక్షల పేరుతో డాక్టర్లు ప్రజలను జలగల్లా పట్టి పీడిస్తున్నారని, ఏమాత్రం వైద్యం తెలియనటువంటి డయాగ్నస్టిక్ సెంటర్ల ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా వైద్యం చేస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారులు డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు మామూళ్ల మత్తులో జోగుతున్నారని, వార్తలు. పట్టణంలో మెడికల్ షాపు యాజమాన్యాలు సిండికేట్ అయ్యారని,5 రూపాయలు అమ్మే ఒక టాబ్లెట్ 10 రూపాయల నుంచి 15 రూపాయల వరకు అమ్ముతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని వారు తెలిపారు.
అద్దె సర్టిఫికెట్లతో ఫార్మసిస్టులు లేకుండా మందులో అమ్మకానికి సాగిస్తున్న మెడికల్ షాప్స్ సీజ్ చేయాలని వారి డిమాండ్ చేశారు.ఫార్మా పరిశ్రమలు ప్రవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల నియంత దోపిడిని అరికట్టాలనీ లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ,రాజీవ్, దాదావలి, తిమ్మగురుడు,మాలిక్, మద్దిలేటి నాయుడు, విజేంద్ర, బిజీ విరుపాక్షి,బిపి వెంకటేష్, కాజా,మల్లికార్జున గౌడ్, నరసింహులు, హనుమంతు, రఫీక్ ,వీరేష్ ,నాగరాజు,దస్తగిరి, ఖాదర్,మాధవ్,నరసప్ప,ఎల్లప్ప, ప్రభు, తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మిగనూరు డిపోను సందర్శించిన (RTC ED) STG రాఘవ కుమార్ గారికి వినతి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



లిఎమ్మిగనూరు ఫిబ్రవరి 14 శనివారం పట్టణంలో డిపోను సందర్శిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాఘవ కుమార్ గారిని కలిసి, ఎమ్మిగనూరు డిపో నుంచి నడుస్తున్న బస్సు సౌకర్యాలు ప్రస్తుతం చాలా తక్కువగా ఉన్నాయని వినతిపత్రం ద్వారా తెలియజేశారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షులు షేక్ సయ్యద్ చాందు .ప్రజల రాకపోకలకు ఎమ్మిగనూరు ముఖ్య కేంద్రంగా ఉండటంతో, వివిధ పట్టణాలు మరియు గ్రామాలకు సరిపడా బస్సులు లేని కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు మరియు గ్రామీణ ప్రాంత ప్రజలు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కాబట్టి ఎమ్మిగనూరు డిపో నుండి బస్సుల సంఖ్యను పెంచి, కొత్త రూట్లు ఏర్పాటు చేసి,ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గారిని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బడ్జెట్ లో ఎస్సీ,ఎస్టీలకు పెద్దపీట వేసిన కూటమి ప్రభుత్వం


**- కదిరికోట ఆదెన్న, టిడిపి నాయకులు,**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు. ఫిబ్రవరి 14 శనివారం పట్టణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రూ.3,32,205 కోట్ల కేటాయింపులో సామాజిక న్యాయమే లక్ష్యంగా ఎస్సీ,ఎస్టీలకు పెద్దపీట వేసేలా కేటాయింపులు చేయడం హర్షనీయమని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న పేర్కొన్నారు. శనివారం అయిన మాట్లాడుతూ... ఆర్థిక శాఖ మంత్రి పయ్యవుల కేశవ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ను చూస్తుంటే... రాష్ట్రాన్ని విధ్వంసం నుండి వికాసం వైపు నడిపిస్తున్నట్లుగా ఉందన్నారు. ఈ బడ్జెట్ లో ఎస్సీ కాంపోనెంట్ కోసం రూ.20,644 కోట్లు, ఎస్టీ కాంపోనెంట్ కోసం రూ.9,190 కోట్లు వెచ్చించడం పట్ల దళిత, గిరిజనుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసి, ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళిత వాడల అభివృద్ధిని విస్మరించి ఆ వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన చెందారు. ఈ వార్షిక బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను సంతృప్తి పరచేలా సంక్షేమం, అభివృద్ధి సమలక్ష్యంగా రెండు కళ్ళుగా భావించి కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు.

## ఘనంగా దామోదర్ సంజీవయ్య జయంతి వేడుకలు



**బేతంచేర్ల : ఉత్తేజిత ప్రతినిధి :**

దామోదర్ సంజీవయ్య 115 వ జయంతి సందర్భంగా బేతంచెర్ల టిడిపి కార్యాలయంలో రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రిగాఏఐసిసి అధ్యక్షులుగా సేవలందించారన్నారు.ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలోబడుగు బలహీన వర్గాలకు భూ పంపిణీ చేసిన గొప్ప మహానియుడని అన్నారు. నిస్వార్థంగా ముఖ్యమంత్రిగాప్రజలకు సేవ చేశారని సొంత ఇల్లు కూడా లేకపోవడం ఆయన నిజాయితీకి నిదర్శనమన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దళిత నాయకులైనటువంటి మాధవ కృష్ణ,కానాల అంజి,శ్రీపతి నాగరాజు, చలపతి వడ్డే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ గట్టు మల్లేశ్వర స్వామి కళ్యాణ మహూత్సవములు

**ఉత్తేజిత న్యూస్ ఫిబ్రవరి 14 సి.బెళగల్**



మండల కేంద్రంలో శివరాత్రి పర్వదినము సందర్భంగా (గట్టు)కొండ పైన వెలసిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ గట్టు మల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవములు సి బెళగల్ గ్రామ పెద్దలు సిబి వసుంధరమ్మ ఆధ్వర్యంలో, పురోహితులు 15-02- 2026 తేదీన ఆదివారం ఉదయం 06:05 గంటలకు ప్రభాత సేవ ఉదయం 08:00 గంటల వరకు శ్రీ స్వామి అమ్మవార్లకు అభిషేకములు నందికోల సేవ, సాయంత్రం 05:00 గంటల నుండి రాత్రి 09:00 గంటల వరకు అమ్మవారికి కుంకుమార్చన జరుపబడును, మరియు16-02-2026 తేదీన సోమవారం ఉదయం. 11-46 ని.లకు శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ గట్టు మల్లేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహూత్సవము జరుగును, మహా శివరాత్రి పర్వదినం సందర్భమున రాత్రి 9-00 గంటల నుండి ఉదయం.6-00 గంటల వరకు రుద్రాభిషేకములు, జాగరణ,
శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ శ్రీ మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణము, నందికోల సేవ, మ. 1-00 గం.కు అన్నదానము. సాయంత్రం 5-00 గంటలకు ప్రభోత్సవము జరుగనని ,కావున భక్తులందరు స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహూత్సవమును తిలకించి, తీర్థప్రసాదములు స్వీకరించి అష్టైర్యాలు ,ధన ధాన్యములతో, సుఖశాంతులతో స్వామి వార్ల కృపకు పాత్రులగుదురని తెలియజేస్తూ శ్రీ స్వామివారి మహోత్సవాలకు భక్తులందరూ పాల్గొనాలని పురోహితులు శ్రీ జంగం నాగమల్లయ్య
ఁ బ్రదర్స్,శ్రీ జె. శివనాగయ్య ఁ బ్రదర్స్ తెలిపారు.

## ఘనంగా దామోదరం.సంజీవయ్య 105 వ జయంతి వేడుకలు...!!

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 14 :**



కర్నూలు పట్టణం నంద్యాల చెక్ పోస్ట్ సెంటర్ లో దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం.సంజీవయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జాయింట్ కలెక్టర్ నూర్ అహమ్మద్,ఏపీ.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి.రాష్ట్ర డైరెక్టర్ జి.నాగముని మరియు సాంఘిక సంక్షేమ శాఖ డి.డి రాధిక పాల్గొన్నారు. అనంతరం స్వర్గీయ దామోదరం.సంజీవయ్య గురించి వక్తలు మాట్లాడుతూ స్వర్గీయదామోదరం.సంజీవయ్య నిరుపేదలు,అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు.దామోదరం.సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి మరియు తొలి దళిత ముఖ్యమంత్రి ఫిబ్రవరి14,1921న కర్నూలు జిల్లా కల్లూరు మండలంలో జన్మించడం జరిగింది.అలాగే మే 8,1972 వ తేది మరణించడం జరిగింది.అని 38 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కింది.రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసి,రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అయ్యాడు మరియు తొలి దళిత అధ్యక్షుడు.సంయుక్త మద్రాసు,ఆంధ్ర రాష్ట్రం,ఆంధ్రప్రదేశ్‌లో అనేకసార్లు మంత్రిగా పనిచేశాడు.1960 జనవరి 11 నుంచి 1962 మార్చి 29 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నాడు.ముఖ్య కృషి పారిశ్రామి కాభివృద్ధికి తెలుగు భాష వాడుకనుపెంచాడు,భూసంస్కరణలు అమలుచేశాడు.గాజులదిన్నె,వరదరాజుల స్వామి ప్రాజెక్టులు ప్రారంభించి రాయలసీమకు సాగునీరుఅందించారు.ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు,గనుల కార్పొరేషన్ ఏర్పాటు చేశాడు.ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు బాగా స్వాములు కావాలని సూచించారు.కర్నూలు జిల్లాకు స్వర్గీయదామోదరం.సంజీవయ్య పేరు పెట్టాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ నాయకులు,మహిళలు,ప్రజా సంఘాల నాయకులు,దళిత నాయకులు,విద్యార్థులు,అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీశైల మల్లన్న ఆశీస్సుల కోసమే పాదయాత్ర

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 14 :**



**శ్రీశైలంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు భేష్.**

**జిల్లా ప్రజల కోసమే అభయారణ్యంలో కాలినడకన**

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

బోలా శంకర కైలాసనాద సృష్టికర్త భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పై, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై, నా నంద్యాల జిల్లా ప్రజలపై శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల దీవెనలు, ఆశీస్సుల కోసం నల్లమల దట్టమైన పులుల ఆవాసమైన అభయారాణ్యంలో కాలినడకన 42 కిలోమీటర్ల దూరం లోని శ్రీశైలంనికి పాదయాత్రతో వస్తున్న నీ ఆశీస్సులకై అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.శనివారం నంద్యాల జిల్లా శ్రీశైల నియోజకవర్గం, ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామికీ పూజలు చేసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైలంకు నల్లమల అరణ్యం గుండా కాలినడక మొదలు పెట్టారు. ఈ సందర్భంగా నల్లమల అడవిలోని గోసాయికట్ట శ్రీ ఆంజనేయస్వామికీ విశేషపూజల అనంతరం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ తాను ప్రతి ఏటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్బంగా నల్లమల అభయారణ్యంలో కాలినడక ద్వారా శ్రీశైలం చేరుకొని శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శనం చేసుకుంటున్నానని, ఈ ఏడాది కూడా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ కాలినడక మొదలు పెట్టానన్నారు.శ్రీశైలంలో మొదటి రోజు శివ దీక్ష స్వాములపై పోలీసుల లాఠీ చార్జ్ పై కొందరు విలేకరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని వివరణ కోరగా, స్వాములపై లాఠీ ఛార్జ్ అనవద్దని, మొదటి రోజు అంచనాకు మించి భక్తులు శ్రీశైలం రావడం వల్ల కొంత ఇబ్బంది వస్తావమని, భక్తులను నియంత్రణ చేయడం జరిగిందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీశైలంలో సాఫీగా స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పిస్తున్నారని, మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ప్రభుత్వం బాగా ఏర్పాటు చేసిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. వెంకటాపురం నుంచి నల్లమల అరణ్యంలో లక్షలాది మంది శివ భక్తులు శ్రీశైలంకు కాలినడకన వెళుతున్నారని, ఈ ఏడాది నల్లమల అభయారణ్యం లో పులుల లెక్కింపు జరుగుతున్నా భక్తులకు అటవీశాఖ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసిందని, ప్రభుత్వశాఖలు, దాతలు కూడా అన్నదానం, ఉచిత వైద్యం, తాగునీటి వసతి నల్లమల అరణ్యంలో కాలినడక భక్తులకు కల్పించడం అభినందనీయమన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

**అధికార కాంగ్రెస్‌కు పోటీ ఇచ్చిన బిఆర్ఎస్**

**అత్యధిక స్థానాలతో ముందున్న కాంగ్రెస్**




హైదరాబాద్:మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో ప్రధాన పోరు అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల మధ్య నెలకొందని పలితాలను పరిశీలిస్తే అర్ధమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. ఉమ్మడి జిల్లాల వారీగా మున్సిపాలిటీల్లో ఆయాపార్టీల విజయం పరిశీలిస్తే...ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆలేరు ( వార్డుల సంఖ్య:12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 3, బీజేపీ 2, ఇతరులు 0), భువనగిరి ( వార్డుల సంఖ్య: 35) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 22, బీఆర్ఎస్ 4, బీజేపీ 4, ఇతరులు 5), చౌటుప్పల్ ( వార్డుల సంఖ్య: 20) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఇతరులు 1),మోత్కూరు ( వార్డుల సంఖ్య:12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 3, బీజేపీ 0, ఇతరులు 1),పోచంపల్లి ( వార్డుల సంఖ్య:13) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, బీజేపీ 1,ఇతరులు 1), యాదగిరి గుట్ట ( వార్డుల సంఖ్య:12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 1, బీజేపీ 2, ఇతరులు 1),హుజూర్‌నగర్ ( వార్డుల సంఖ్య: 28) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 4, బీజేపీ 0, ఇతరులు 5),కోదాడ ( వార్డుల సంఖ్య: 35) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 26, బీఆర్ఎస్ 3, బీజేపీ 0, ఇతరులు 6), నేరేడుచర్ల ( వార్డుల సంఖ్య: 15): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 5, బీజేపీ 0, ఇతరులు 1),సూర్యాపేట (వార్డుల సంఖ్య: 48) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 31, బీఆర్ఎస్ 13, బీజేపీ 1, ఇతరులు 3),తిరుమలగిరి (వార్డుల సంఖ్య: 15) : బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 10, బీజేపీ 0, ఇతరులు 0),చండూర్ ( వార్డుల సంఖ్య: 10) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 3, బీజేపీ 0, ఇతరులు 1).,చిట్యాల ( వార్డుల సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 2, బీజేపీ 0, ఇతరులు 1).దేవరకొండ ( వార్డుల సంఖ్య: 20) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, ఇతరులు 2).హాలియా (వార్డుల సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 1, బీజేపీ 0, ఇతరులు 0).

మిర్యాలగూడ ( వార్డుల సంఖ్య: 48): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 31, బీఆర్ఎస్ 14, బీజేపీ 1, ఇతరులు 2).

నందికొండ (వార్డుల సంఖ్య: 12): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 1, బీజేపీ 0, ఇతరులు 0).

ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీకి ఈ జిల్లా కంచుకోట. ఈ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ.. అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇచ్చింది. పలు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ తన సత్తా చాటింది. జిల్లాలో 10 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడింది. చేర్యాల ( వార్డులు సంఖ్య: 12 ): బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 7, బీజేపీ 0, ఇతరులు 0).,దుబ్బాక ( వార్డులు సంఖ్య: 20) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 11, బీజేపీ 2, ఇతరులు 3).,గజ్వేల్ ( వార్డులు సంఖ్య: 20) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 11, బీజేపీ 1, ఇతరులు 1).,హుస్నాబాద్ ( వార్డులు సంఖ్య: 20): కాంగ్రెస్. ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 4, బీజేపీ 0, ఇతరులు 0).అందోలు - జోగిపేట ( వార్డులు సంఖ్య: 20) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 3, బీజేపీ 0, ఇతరులు 1).గడ్డపోతారం ( వార్డులు సంఖ్య: 18) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 14, బీజేపీ 0, ఇతరులు 1).,గుమ్మడిదల ( వార్డులు సంఖ్య: 22) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 15, బీజేపీ 2, ఇతరులు 1).,ఇంద్రేశం (వార్డులు సంఖ్య: 18) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 9, బీజేపీ 2, ఇతరులు 1).,ఇస్నాపూర్ ( వార్డులు సంఖ్య: 26) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 12, బీజేపీ 0, ఇతరులు 4).

జిన్నారం ( వార్డులు సంఖ్య: 20) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 8, బీజేపీ 4, ఇతరులు 2).

కోహిర్ (వార్డులు సంఖ్య: 16) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 5, బీజేపీ 1, ఇతరులు 2).

నారాయణ్‌ఖేడ్ (వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 3, బీజేపీ 1, ఇతరులు 0)

సదాశివపేట్ ( వార్డులు సంఖ్య: 26) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 17, బీఆర్ఎస్ 7, బీజేపీ 1, ఇతరులు 1).

సంగారెడ్డి ( వార్డులు సంఖ్య: 38) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 22, బీఆర్ఎస్ 10, బీజేపీ 2, ఇతరులు 4).

జహీరాబాద్ ( వార్డులు సంఖ్య: 37) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 15, బీజేపీ 3, ఇతరులు 5)

మెదక్ ( వార్డులు సంఖ్య: 32) : బీఆర్ఎస్. ( కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 15, బీజేపీ 2, ఇతరులు 1)

నర్సాపూర్ ( వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, బీజేపీ 4, ఇతరులు 0).

రామాయంపేట ( వార్డులు సంఖ్య:12) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 3, బీజేపీ 1, ఇతరులు 0)

తూప్రాన్ ( వార్డులు సంఖ్య: 16) : కాంగ్రెస్. ( కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 9, బీజేపీ 3, ఇతరులు 0).

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలు కైవసం చేసుకుంది. కానీ నారాయణపేట మున్సిపాలిటీ మాత్రం బీజేపీ ఖాతాలో పడింది. ఇక అలంపూర్, అమరచింత మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. భూత్పూర్ ( వార్డులు సంఖ్య: 10) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 1, బీజేపీ 2, ఇతరులు 0).దేవరకద్ర ( వార్డులు సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 4, బీజేపీ1, ఇతరులు 1).కోస్గి ( వార్డులు సంఖ్య: 16) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 0, బీజేపీ 0, ఇతరులు 0).

మద్దూరు ( వార్డులు సంఖ్య: 16) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 6, బీజేపీ 0, ఇతరులు 1).

మక్తల్ ( వార్డులు సంఖ్య: 15/16) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 0, బీజేపీ 3, ఇతరులు 0).

నారాయణపేట ( వార్డులు సంఖ్య: 24): బీజేపీ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 2, బీజేపీ 11, ఇతరులు 4)

అలంపూర్ ( వార్డులు సంఖ్య: 10): హంగ్ (కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 5 గెలుచుకుంది).గద్వాల్ ( వార్డులు సంఖ్య: 37) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 11, బీజేపీ 7, ఇతరులు 3).,అయిజ ( వార్డులు సంఖ్య: 20): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 13, బీజేపీ 0, ఇతరులు 0).,వడ్డేపల్లి ( వార్డులు సంఖ్య: 10): స్వతంత్రులు.. 8 వార్డుల్లో గెలుపొందారు. కాంగ్రెస్ (1), బీఆర్ఎస్ (1) గెలుపొందింది.,అమరచింత ( వార్డులు సంఖ్య: 10) : హంగ్ (కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఇతరులు 1),ఆత్మకూరు ( వార్డులు సంఖ్య: 10) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 1, బీజేపీ 3, ఇతరులు 0)., కొత్తకోట ( వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 3, బీజేపీ 1, ఇతరులు 1).,పెబ్బేరు ( వార్డులు సంఖ్య:12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 5, బీజేపీ 0, ఇతరులు 0).వనపర్తి ( వార్డులు సంఖ్య: 33) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 20, బీఆర్ఎస్ 8, బీజేపీ 2, ఇతరులు 3).కల్వకుర్తి ( వార్డులు సంఖ్య: 22) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 3, బీజేపీ 5, ఇతరులు 1).కొల్లాపూర్ ( వార్డులు సంఖ్య: 19) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 3, బీజేపీ 0, ఇతరులు 0).నాగర్‌కర్నూలు ( వార్డులు సంఖ్య: 24): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ 6, బీజేపీ 0, ఇతరులు 0).షాద్‌నగర్ ( వార్డులు సంఖ్య: 28) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 22, బీఆర్ఎస్ 4, బీజేపీ 4, ఇతరులు 5).కొడంగల్ ( వార్డులు సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 1, బీజేపీ 0, ఇతరులు 1).

ఆమనగల్ ( వార్డులు సంఖ్య: 15) : బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 1, బీఆర్ఎస్ 8, బీజేపీ 6, ఇతరులు 0).

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ ( వార్డులు సంఖ్య: 30): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 13, బీజేపీ 0, ఇతరులు 5).,స్టేషన్ ఘన్‌పూర్ ( వార్డులు సంఖ్య: 18): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 5, బీజేపీ 0, ఇతరులు 0).,నర్సంపేట ( వార్డులు సంఖ్య: 30) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 21, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, ఇతరులు 2).,వర్ధన్నపేట ( వార్డులు సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 6, బీజేపీ 0, ఇతరులు 1).

పరకాల ( వార్డులు సంఖ్య: 22) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 6, బీజేపీ 3, ఇతరులు 0).

డోర్నకల్ ( వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 4, బీజేపీ 0, ఇతరులు 0).

కేసముద్రం ( వార్డులు సంఖ్య: 16) : హంగ్ (కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8).,మహబూబాబాద్ ( వార్డులు సంఖ్య: 36): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 11, బీజేపీ 1, ఇతరులు 11).మరిపెడ ( వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 5, బీజేపీ 0, ఇతరులు 1).తొర్రూర్ ( వార్డులు సంఖ్య: 16): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 9, బీజేపీ 0, ఇతరులు 0).భూపాలపల్లి ( వార్డులు సంఖ్య: 30) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 10, బీజేపీ 2, ఇతరులు 2).ములుగు ( వార్డులు సంఖ్య: 20): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 5, బీజేపీ 1, ఇతరులు 2). ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ..చొప్పదండి ( వార్డులు సంఖ్య: 14) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 1, బీజేపీ 3, ఇతరులు 0).హుజూరాబాద్ ( వార్డులు సంఖ్య: 30) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 8, బీజేపీ 5, ఇతరులు 1).జమ్మికుంట ( వార్డులు సంఖ్య: 30): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 12, బీజేపీ 4, ఇతరులు 4).ధర్మపురి ( వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 9, బీజేపీ 0, ఇతరులు 0).జగిత్యాల ( వార్డులు సంఖ్య: 50): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 23, బీఆర్ఎస్ 4, బీజేపీ 6, ఇతరులు 17).కోరుట్ల ( వార్డులు సంఖ్య: 33) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ 8, బీజేపీ 6, ఇతరులు 1).మెట్‌పల్లి ( వార్డులు సంఖ్య: 26) : బీజేపీ ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 6, బీజేపీ 10, ఇతరులు 4).రాయికల్ ( వార్డులు సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, బీజేపీ 5, ఇతరులు 1).సిరిసిల్ల ( వార్డులు సంఖ్య:39): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 27, బీజేపీ 5, ఇతరులు 1).వేములవాడ ( వార్డులు సంఖ్య: 28): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 5, బీజేపీ 8, ఇతరులు 2).మంథని ( వార్డులు సంఖ్య: 13) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 1, బీజేపీ 0, ఇతరులు 1).పెద్దపల్లి ( వార్డులు సంఖ్య: 36) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 27, బీఆర్ఎస్ 1, బీజేపీ 1, ఇతరులు 7).సుల్తానాబాద్ ( వార్డులు సంఖ్య: 15) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 1, బీజేపీ 1, ఇతరులు 1).ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రులు హవా చాటారు. ఏదులాపురం ( వార్డులు సంఖ్య: 32) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 24, బీఆర్ఎస్ 2, బీజేపీ 0, ఇతరులు 6).,కల్లూరు ( వార్డులు సంఖ్య: 20) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 7, బీజేపీ 0, ఇతరులు 1).,మధిర ( వార్డులు సంఖ్య: 22) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ 1, బీజేపీ 0, ఇతరులు 3).,సత్తుపల్లి ( వార్డులు సంఖ్య: 23) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 17, బీఆర్ఎస్ 6, బీజేపీ 0, ఇతరులు 0).వైరా ( వార్డులు సంఖ్య: 20) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 12, బీఆర్ఎస్ 5, బీజేపీ 0, ఇతరులు 3).అశ్వారావుపేట ( వార్డులు సంఖ్య: 22) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 17, బీఆర్ఎస్ 2, బీజేపీ 1, ఇతరులు 2).ఇ÷-లలెందు ( వార్డులు సంఖ్య: 24) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 3, బీజేపీ 0, ఇతరులు 2).ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలావుంది. ఆదిలాబాద్ ( వార్డులు సంఖ్య: 49): బీజేపీ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 6, బీజేపీ 21, ఇతరులు 11).భైంసా ( వార్డులు సంఖ్య: 26): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 1, బీఆర్ఎస్ 2, బీజేపీ 13, ఇతరులు 3).ఖానాపూర్ ( వార్డులు సంఖ్య: 12): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 4, బీజేపీ 4, ఇతరులు 1).నిర్మల్ ( వార్డులు సంఖ్య: 42): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 24, బీఆర్ఎస్ 2, బీజేపీ 13, ఇతరులు 3).ఆసిఫాబాద్ ( వార్డులు సంఖ్య: 20): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 9, బీజేపీ 0, ఇతరులు 4).కాగజ్ నగర్ ( వార్డులు సంఖ్య: 30): బీఆర్ఎస్ (కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 11, బీజేపీ 5, ఇతరులు 5).బెల్లంపల్లి ( వార్డులు సంఖ్య: 34) : హంగ్.. (కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 14, బీఆర్ఎస్ 1, బీజేపీ 5, ).

చెన్నూరు ( వార్డులు సంఖ్య: 18): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 4, బీజేపీ 2, ఇతరులు 1).

క్యాతనపల్లి ( వార్డులు సంఖ్య: 22): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 10, బీజేపీ 0, ఇతరులు 5).

లక్షెట్టిపేట ( వార్డులు సంఖ్య: 15): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 3, బీజేపీ 1, ఇతరులు 0).

రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల ( వార్డులు సంఖ్య: 18): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 4, బీజేపీ 3, ఇతరులు 0).ఇబ్రహీంపట్నం ( వార్డులు సంఖ్య: 24): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 13, బీజేపీ 2, ఇతరులు 1).

మొయినాబాద్ ( వార్డులు సంఖ్య: 26): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 7, బీజేపీ 4, ఇతరులు 5).

శంకర్‌పల్లి ( వార్డులు సంఖ్య: 15): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 4, బీజేపీ 0, ఇతరులు 2).

పరిగి ( వార్డులు సంఖ్య: 18): హంగ్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8, బీజేపీ 0, ఇతరులు 2).

తాండూర్ ( వార్డులు సంఖ్య: 36) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 12, బీజేపీ 3, ఇతరులు 2).

వికారాబాద్ ( వార్డులు సంఖ్య: 34) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 11, బీజేపీ 4, ఇతరులు 3).

అలియాబాద్ ( వార్డులు సంఖ్య: 20) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 7, బీజేపీ 3, ఇతరులు 2).

మూడుచింతలపల్లి ( వార్డులు సంఖ్య: 24) : బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 14, బీజేపీ 1, ఇతరులు 0).

ఎల్లంపేట ( వార్డులు సంఖ్య: 24): బీఆర్ఎస్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 12, బీజేపీ 4, ఇతరులు 0).

ఉమ్మడి నిజామాబాద్‌లో ఆర్మూరు ( వార్డులు సంఖ్య: 36) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 5, బీజేపీ 8, ఇతరులు 4).భీమ్‌గల్ ( వార్డులు సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 4, బీజేపీ 0, ఇతరులు 0).

బోధన్ ( వార్డులు సంఖ్య: 38) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 17, బీఆర్ఎస్ 5, బీజేపీ 3, ఇతరులు 13).

బాన్సువాడ ( వార్డులు సంఖ్య: 19) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఇతరులు 2).

బిచ్కుంద ( వార్డులు సంఖ్య: 12) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 2, బీజేపీ 0, ఇతరులు 0).

కామారెడ్డి ( వార్డులు సంఖ్య: 49) : కాంగ్రెస్ ( కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 10, బీజేపీ 18, ఇతరులు 2).

ఎల్లారెడ్డి ( వార్డులు సంఖ్య: 12): కాంగ్రెస్ ( కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 1, బీజేపీ 0, ఇతరులు 1). ఈఫలితాల అనంతరం హంగ్ ఏర్పడిన కొన్నిచోట్ల క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకుంటారు.

# మహిళలంటే వైసిపికి గౌరవం లేదు



**సిఎం తల్లిపై అంబటి వ్యాఖ్యలు దుర్మార్గం**

**మండలిలో అంబటి వ్యాఖ్యలపై లోకేశ్ ఆగ్రహం**

**అంబటి వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా కేసులా అన్న బొత్స**

**పరస్పర విమర్శలతో కొంత గందరగోళం**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో శుక్రవారం టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం రాజుకుంది. ఏపీ అసెంబ్లీ, మండలిలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై పెట్టిన తీర్మానంపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలపై శాసన మండలిలో దుమారం రాజుకుంది. అంబటి రాంబాబు వ్యాఖ్యలపై ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తల్లిని అంబటి రాంబాబు అవమానించారని లోకేశ్ ధ్వజమెత్తారు. ఈ విషయంలో ఆయనని వదలిపెట్టేది లేదని అన్నారు. సీఎం తల్లిని దారుణంగా అవమానిస్తే అది చిన్నమాట అవుతుందా? అని నిలదీశారు. అయితే, మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతుండగా.. విపక్షనేత బొత్స సత్యనారాయణ పలుమార్లు అడ్డుతగిలారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబును, ఆయన వ్యాఖ్యలను ప్రోత్సహిస్తే ఎలాగని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. సొంత తల్లి, చెల్లిని గౌరవించడం వైసీపీ నేతలకు చేత కాదన్నారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలను గౌరవించే సంస్కృతి వైసీపీకి లేదని, కూటమి ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. జగన్ తల్లి, చెల్లి అయినా, ఇంకే మహిళ జోలికి వెళ్లినా తాము ఊరుకోమని హెచ్చరించారు. బెంగళూరులో ఉన్న జగన్.. అంబటి రాంబాబు ఏదో రెండు చిన్న మాటలు అన్నారని ఎలా అంటున్నారని లోకేశ్ ఫైర్ అయ్యారు. సీఎం తల్లిని దారుణంగా అవమానిస్తే అది ఏదో రెండు చిన్నమాటలా? అని దుయ్యబట్టారు. మహిళలంటే వైసీపీ నేతలకు గౌరవం లేదని మండిపడ్డారు. అంబటి రాంబాబు చేసిన స్టేట్‌మెంట్ కరెక్టా, తప్పా స్పష్టం చేయాలని బొత్స సత్యనారాయణని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై వైసీపీ నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. అంబటి రాంబాబుపై దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. అంబటి రాంబాబును కించపరిచేలా మాట్లాడటంతోనే అంబటి అలా మాట్లాడారని చెప్పుకొచ్చారు. విజ్ఞత కలిగిన వ్యక్తి కాబట్టే తప్పుగా మాట్లాడిన తన మాటలు వెనక్కి తీసుకుంటున్నట్లు వెంటనే తెలిపారని అన్నారు. చేసిన తప్పును క్షమించాలని అంబటి రాంబాబు కోరారని ప్రస్తావించారు. అలాంటి వ్యక్తిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో మంచిపద్ధతేనా అని ప్రశ్నించారు. మరో వైసీపీ నేత ఇంటిపై పెట్రోల్ బాంబులు వేయడం సరైనదేనా అంటూ నిలదీశారు. తప్పు ఎవరు చేసినా తప్పు తప్పే... సమర్థించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అప్పుడు ఉన్న పరిస్థితుల్లో మాట్లాడానని క్షమించాలని అంబటి కోరారని అన్నారు. క్షమాపణలు చెప్పినా అంబటిని వేధిస్తున్నారని, చేసిన దానికి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. అంబటి రాంబాబు తల్లి గురించి ఎవరు మాట్లాడారో బొత్స సత్యనారాయణ చెప్పాలని హోంమంత్రి వంగలపూడి అనిత సభలో డిమాండ్ చేశారు. అంబటిని దూషిస్తూ ఎవరైనా మాట్లాడినట్లు ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. రెచ్చగొట్టేలా ఆయన దారుణంగా మాట్లాడారని ధ్వజమెత్తారు. తన కుక్కను కూడా టచ్ చేయలేరని, ఏ పోలీసు వస్తారో రానివ్వండి అంటూ అంబటి సవాల్ చేశారని ప్రస్తావించారు. తల్లి, చెల్లి

గురించి రెచ్చగొట్టేలా మాట్లాడిన వ్యక్తిని పెద్దల సభలో వెనకేసుకొస్తారా అని ప్రశ్నించారు. అంబటిని వెనకేసుకుని వచ్చేందుకు వైసీపీ సభ్యులకు కనీసం సెన్స్ ఉందా? అని నిలదీశారు.. కాగా, అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాగ్వాదంతో శాసన మండలి కాసేపు వాయిదా పడింది..

# కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత

**మున్సిపల్ ఫలితాలే ఇందుకు నిదర్శన్ ఫలితాలపై హరీష్ రావు వ్యాఖ్య**

హైదరాబాద్: ముఖ్యమంత్రి, మంత్రులు సహా యావత్ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటై కొట్లాడినా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును అడ్డుకోలేకపోయారని పార్టీ నేత హరీస్ రావు అన్నారు. అధికార దుర్వినియోగం, డబ్బు రాజకీయాలు, బెదిరింపులు అన్నింటినీ తట్టుకుని గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలనకు చెంపపెట్టు అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దాదాపు 700 పైగా వార్డుల్లో బీఆర్ఎస్ గెలుపు సాధించడం యాదృచ్ఛికం కాదన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకూ పెరుగుతున్న ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శనం అని పేర్కొన్నారు. ప్లలె, పట్టణం తేడా లేకుండా రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మందగించింది. ఎన్నికల హామీలు గాలిలో కలిసిపోయాయి. సంక్షేమ పథకాలు అటకెక్కాయి. అందువల్లనే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటు అనే కొరడాతో ప్రజలు బుద్ధి చెప్పారు. కాంగ్రెస్‌ను గద్దె దించే శక్తి ఒక్క బీఆర్ఎస్ కు మాత్రమే ఉందని, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని మొన్న పంచాయితీ ఫలితాలు, నేడు మున్సిపల్ ఫలితాలు కుండబద్దలు కొట్టి చెప్పాయన్నారు. అధికార పక్షం దౌర్జన్యాలను ఎదుర్కొని, ప్రతిపక్షంలో ఉంటూ సాధించిన ఈ ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. పాలన గాలికి వదిలి.. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా కాలం గడుపుతున్న రేవంత్ సర్కారు భరతం పడుతూనే ఉంటం. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ÷ఫైల్యాలను ఎండగడుతూనే ఉంటం. ప్రజల ఆశీస్సులతో తెలంగాణలో గులాబీ జెండా ఎగురేసేందుకు నిర్విరామ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా గెలిచి సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులందరికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు ఎపి అసెంబ్లీలో బడ్జెట్

**బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న మంత్రి కేశవ్**

అమరావతి 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను శనివారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్నారు. దీనికి ముందు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ లాంఛనంగా బడ్జెట్‌ను ఆమోదిస్తుంది. రాష్ట్ర అసెంబ్లీలో ఉదయం 11:15కి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్ట నున్నారు. బడ్జెట్ మొత్తం దాదాపు రూ.3.45-3.50 లక్షల కోట్లు ఉండే అవకాశముందని అంచనాలున్నాయి.. అయితే, బడ్జెట్‌కు ముందే.. అంటే రేపు ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షనత ఏపీ కేబినెట్ సమావేశం జరగనుంది.. ఈ సమావేశంలో ఏపీ బడ్జెట్2026-27కు ఆమోదముద్ర వేయనుంది మంత్రివర్గం.. ఆ తర్వాత ఉదయం 11.10 గంటలకు ఏపీ అసెంబ్లీ ప్రారంభం కానుండగా.. 11.15కి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసన సభలో బ్జడెట్ ప్రవేశపెట్టనున్నారు.. శాసన మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర ప్రవేశపెట్టే అవకాశం ఉంది.. ఏపీ బ్జడెట్ 2026-27 అభివృద్ధి, సంక్షేమ, మరియు ఎన్నికల హామీలను ప్రధానంగా దృష్టిపెట్టుకుని రూపొందించినట్టుగా తెలుస్తోంది.. ఈ బ్జడెట్‌లో అభివృద్ధి, సంక్షేమం, రైతు, మహిళల సంక్షేమం ప్రధానంగా ప్రాధాన్యం పొందనుంది. 'సూపర్ సిక్స్' హామీలలో ఇప్పటికే నాలుగు అమలు చేస్తున్నారు. వ్యయ ప్రాధాన్యత రంగాలకు భారీ నిధులు కేటాయించబోతుంది ప్రభుత్వం.. ఇక, రేపు మధ్యాహ్నం 12.50 కి వ్యవసాయ ప్రత్యేక పద్దును అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు.. శాసన మండలిలో వ్యవసాయ పద్దును మంత్రి నారాయణ ప్రవేశపెట్టబోతున్నారు..

# రూ.42 వేల కోట్లపై కీలక అప్డేట్..

**బ్యాంకుల్లో మూలుగుతోన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై కీలక ప్రకటన చేసింది**



బ్యాంకుల్లో ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఏకంగా రూ.42 వేల కోట్లకుపైగా ఉన్నాయి. వీటిని సంబంధించిన కీలక అప్డేట్ ఇచ్చింది ఆర్‌బీఐ. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను అందించేందుకు ఏర్పాటు చేసిన పోర్టల్ పరిధిలోకి 30 బ్యాంకులు వచ్చినట్లు తెలిపింది. ఇకపై ఈజీగా తమకు సంబంధించిన డిపాజిట్లను తనిఖీ చేసుకోవచ్చు.
బ్యాంకుల్లో మూలుగుతోన్న రూ.42 వేల కోట్లకుపైగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై కీలక ప్రకటన చేసింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్గమ్ పోర్టల్ ద్వారా తమకు సంబంధించిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు లేదా అకౌంట్ల వివరాలను తనిఖీ చేసుకునేందుకు 30 బ్యాంకులు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. అంటే ఈ ఉద్గమ్ పోర్టల్ లోకి 30 బ్యాంకులు చేరినట్లు వెల్లడించింది. అలాగే మిగిలిన బ్యాంకులు సైతం త్వరలోనే ఉద్గమ్ పోర్టల్ పరిధిలోకి వస్తాయని, ఆ ప్రాసెస్ కొనసాగుతు న్నట్లు తెలిపింది. ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్లకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఆన్‌లైన్ పోర్టల్ ఉద్గమ్ ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు లేదా ఖాతాలు అనేవి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవార్నెస్‌లో భాగం. మీకు సంబంధించిన అకౌంట్లు, డిపాజిట్లు ఏమైనా ఉంటే మీరు ఉద్గమ్ పోర్టల్లో రిజిస్టర్ అయి తనిఖీ చేయవచ్చు. ఏవైనా డిపాజిట్లు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని మీరు క్లెయిమ్ చేసుకునేందుకు వీలుంటుంది. 'మార్చి 4, 2024 నాటికి మొత్తం 30 బ్యాంకులు ఉద్గమ్ పోర్టల్ లోకి వచ్చాయి. ఆర్‌బీఐ డీఈఏ ఫండ్ లోని ఈ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల మొత్తంలో ఈ బ్యాంకుల్లోనే 90 శాతంగా ఉన్నాయి.' అని తెలిపింది సెంట్రల్ బ్యాంక్. ఈ మేరకు ఉద్గమ్ పోర్టల్‌లో తరుచూ అడిగే ప్రశ్నలకు సమాధానాలు అందించింది. ఉద్గమ్ పోర్టల్‌లో తమకు సంబంధించిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకోవాలంటే ముందుగా యూజర్లు తమ పేరు, మొబైల్ నంబర్ సాయంతో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ పోర్టల్ కేవలం వివిధ బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించిన వివరాలను తనిఖీ చేసేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. అలాగే వివిధ బ్యాంకులకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రాసెస్ సంబంధించి సమాచారం మాత్రమే అందిస్తుంది. అంటే ఈ పోర్టల్ ద్వారా తమకు సంబంధించిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం లేదు. మీరు సదరు బ్యాంకుకు వెళ్లి క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది.
మరోవైపు.. 2023, మార్చి 31 నాటికి దేశంలోని వివిధ బ్యాంకుల్లో ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్ల విలువ రూ.42,270 కోట్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వార్షిక ప్రాతిపదికన చూసుకుంటే ఈ డిపాజిట్లు 28 శాతం పెరిగాయి. 2021-22 ఆర్థిక ఏడాదిలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల వద్ద అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.32,934 కోట్లు ఉండేవి. 2022-23 ఏడాదిలో ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్దే రూ.36,185 కోట్లు ఉండగా.. ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.6,087 కోట్లు ఉన్నాయి. సాధారణంగా 10 ఏళ్లు లేదా అంత కంటే ఎక్కువ కాలం పాటు క్లెయిమ్ చేయని డిపాజిట్లను బ్యాంకులు, రిజర్వ్ బ్యాంకుకు చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ నిధికి బదిలీ చేస్తాయి.

# అక్కడ సీక్రెట్ బంకర్ నిర్మించుకుంటున్న మార్క్ జుకర్‌బర్గ్..

ప్రపంచంలోనే అత్యంత కుబేరుల్లో ఒకరైన మెటా సీఈఓ మార్క్ జుకర్‌బెర్గ్.. హవాయి దీవుల్లో పెద్ద మొత్తంలో భూమి కొనుగోలు చేశారట. అక్కడే ఒక విలాసవంతమైన ఎస్టేట్ నిర్మించుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని కోసం ఏకంగా 260 మిలియన్ డాలర్లు ఖర్చు పెడుతున్నట్లు సమాచారం.
ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ఫౌండర్ మార్క్ జుకర్‌బర్గ్ ఇప్పుడు ప్రపంచంలోని కుబేరుల్లో టాప్-10లో ఉటారు. ఈయన ఇప్పుడు హవాయి ద్వీపాల్లోని కవాయిలో కొంత భూమి కొనుగోలు చేసేందుకు కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. అక్కడే ఇప్పుడు విలాసవంత ఎస్టేట్‌ను నిర్మించుకుంటున్నట్లు సమాచారం. దీంట్లోనే ఒక రహస్య బంకర్ ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఇప్పటికే అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. హవాయి ద్వీపాల్లోని కవాయి ప్రాంతంలో దాదాపు 1400 ఎకరాల భూమిని మార్క్ జుకర్‌బర్గ్ కొనుగోలు చేశారట. దీంట్లో ఏకంగా 5 వేల చదరపు అడుగుల్లో బంకర్ నిర్మిస్తున్నారు. బంకర్‌లోనే విద్యుత్, ఆహారం వంటి సదుపాయాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు మార్క్. దీని కోసం 260 మిలియన్ డాలర్ల వరకు ఖర్చు పెడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇది భారత కరెన్సీలో దాదాపు రూ. 2 వేల కోట్లకుపైనే



ఉంటుందంట. అయితే దీనిపై ఇప్పటివరకు మార్క్ జుకర్‌బర్గ్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ప్రాజెక్ట్ విషయాలు ఎక్కడా బయటికి రాకుండా జుకర్‌బర్గ్ జాగ్రత్త పడుతున్నట్లుగా తెలిసింది. దీనికి సంబంధించిన వివరాల్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన చాలా మంది సహచరుల్ని ప్రాజెక్ట్ నుంచి తప్పించినట్లు అక్కడ పనిచేస్తున్న కార్మికులు చెప్పారట. ఆ ప్రాజెక్ట్ వివరాల్ని బయటకు వెల్లడిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా.. అక్కడ ఫొటోలు తీసుకునేందుకు కూడా కార్మికులు భయపడుతున్నారట. కవాయి దీవుల జనాభా దాదాపు 73 వేలుగా ఉంది. స్వర్గాన్ని తలపించే ఈ ప్రాంతాన్ని ది గార్డెన్ ఐల్‌గా చెబుతుంటారు. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులకు ఈ ప్రాంతం వేదికగా నిలుస్తుంటుంది. పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్, జురాసిక్ పార్క్ వంటి చాలా హాలీవుడ్ సినిమాల్ని ఇక్కడే తీశారు. 2014 ఆగస్టులోనే జుకర్‌బర్గ్ ఈ ప్రాంతంలో భూమి కొనుగోలు చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. 2016 క్రిస్మస్ హాలిడే నేపథ్యంలో కవాయి దీవుల్లో మార్క్ పర్యటించి.. కుటుంబంతో కలిసి దిగిన కొన్ని ఫొటోల్ని కూడా పోస్ట్ చేసినట్లు మీడియా కథనాల్లో వచ్చాయి.

# వరుసగా 3 రోజులు బ్యాంకులు బంద్..




మీకు బ్యాంకులో ఏదైనా పని ఉందా? అయితే వీకెండ్ వరకు ఆగకండి. ముందే చూస్కుంటే బెటర్. ఎందుకంటే వరుసగా రెండు వారాంతాలు బ్యాంకులకు వరుసగా 3 రోజుల చొప్పున సెలవులు వస్తున్నాయి. ఇప్పుడు మార్చి 8 నుంచి 10 వరకు బ్యాంకులకు సెలవు ఉంది. ఈ నెలలో మొత్తం వేర్వేరు ప్రాంతాల్ని బట్టి 14 రోజులు బ్యాంకులకు హాలిడే ఉంది.
బ్యాంక్ కస్టమర్లకు అలర్ట్. వరుసగా 3 రోజులు బ్యాంకులకు సెలవు ఉంది. మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న (శుక్రవారం) బ్యాంక్ హాలిడేగా నిర్ణయించింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. దేశంలో చాలా ప్రాంతాల్లో ఈ రోజున సెలవు ఉంది. మార్చి నెలకు సంబంధించి ఆర్‌బీఐ క్యాలెండర్ ప్రకారం మొత్తం 14 రోజులు బ్యాంక్ సెలవులు ఉన్నాయి. వీటిల్లో రెండో, నాలుగో శనివారాలు, ఆదివారాలు కూడా ఉండటం గమనించొచ్చు. అయితే ఇక్కడ విశేషం ఏంటంటే.. రెండు లాంగ్ హాలిడే వీకెండ్స్ ఉన్నాయి. అంటే 3 రోజుల చొప్పున రెండుసార్లు సెలవులు ఉన్నాయి. ఇప్పుడు మార్చి 8న మహాశివరాత్రి సెలవు కాగా.. మార్చి 9న రెండో శనివారం, మార్చి 10న ఆదివారం ఉంది. అంటే ఈ 3 రోజుల పాటు బ్యాంకులకు హాలిడే ఉండటంతో ఏదైనా పని చూసుకోవాలంటే ఈ రెండు రోజుల్లోనే చూసుకోవడం బెటర్. ఉద్యోగాలు చేసే వారికి సెలవులు దొరకడం కష్టం. అందుకే బ్యాంకులో ఏదైనా పని ఉంటే దానికి తగ్గట్లుగా షెడ్యూల్ చేసుకొని వెళ్లాల్సి ఉంటుంది. తీరా అక్కడికి వెళ్లాక బ్యాంక్ క్లోజ్ ఉంటే సమయం వృథా అవుతుంది. పని ఆలస్యం అవుతుంది. అందుకే బ్యాంకులు ఎప్పుడెప్పుడు పనిచేస్తున్నాయి.. హాలిడేస్ ఎప్పుడు ఉన్నాయి అనేది ముందుగానే తెలుసుకోవాలి.
మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, చండీగఢ్, ఉత్తరాఖండ్, జమ్మూ- శ్రీనగర్, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో బ్యాంకులకు హాలిడే ఉంది. తర్వాత మళ్లీ మార్చి 25న బ్యాంకులకు హోలీ సందర్భంగా పలు రాష్ట్రాల్లో సెలవు ఉండగా.. అంతకుముందు రెండు రోజులు అంటే మార్చి 23న నాలుగో శనివారం, మార్చి 24న ఆదివారం హాలిడే ఉంది. ఇక్కడ కూడా లాంగ్ హాలిడే వీకెండ్ వచ్చిందన్నమాట. బ్యాంకులకు సెలవుల్ని ఆర్బీఐ జాతీయ సెలవులు, ప్రాంతీయ సెలవులు, రెండో నాలుగో శనివారాలు, ఆదివారాలు ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని నిర్ణయిస్తుంటుంది.

# ట్యాక్స్ పేయర్స్‌కి గుడ్‌న్యూస్..

పెండింగ్ రిఫండ్స్ కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పన్ను చెల్లింపుదారులకు అదిరే శుభవార్త అందించింది ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్. పెండింగ్ రిటర్న్స్ ప్రాసెసింగ్ పూర్తి చేసి రిఫండ్స్ రిలీజ్ చేస్తామని వెల్లడించింది. అందుకు డెడ్‌లైన్ ఫిక్స్ చేసింది. అర్హులైన వారికి ఇ-మెయిల్స్ పంపిస్తోంది. మరి మీకు వస్తుందమే చెక్ చేసుకోండి. పన్ను చెల్లింపుదారులకు అదిరే శుభవార్త. ఆర్థిక ఏడాది 2020-21 (అసెస్మెంట్ ఇయర్ 2021-22)కు సంబంధించిన ఆదాయపు పన్ను రిఫండ్ కోసం ఎదురుచూస్తున్న వారికి తీపికబురు అందించింది ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్. ఈ మేరకు మార్చి 1,2024 రోజునే ఆదేశాలు జారీ చేసింది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్. పెండింగ్ రిఫండ్స్ కోసం చూస్తున్న ట్యాక్స్ పేయర్స్ కి ఆదాయపు ట్యాక్స్ రిఫండ్ ఏప్రిల్ 30, 2024 నాటికి అందజేయనున్నట్లు వెల్లడించింది. ఎవరైతే చాలా రోజులుగా ఆయా పెండింగ్ రిఫండ్ కోసం చూస్తున్నారో వారికి మెయిల్స్ పంపిస్తోంది ఐటీశాఖ. వారు తమ స్టేటస్ తెలుసుకునేందుకు ఇమెయిల్స్ చెక్ చేసుకోవచ్చని తెలిపింది. అలాగే ఏదైనా రిఫండ్ చెల్లించే అవకాశం ఉన్న వారికి సమాచార నోటీసులు పంపించే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు ఇ-మెయిల్స్ చెక్ చేసుకుంటూ ఉండాలని తెలిపింది. సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ ఐటీఆర్స్ ని నిర్ణీత సమయంలోపూ ప్రాసింగ్ చేసిన తర్వాత వాటికి సంబంధించి ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 143(1) ప్రకారం ట్యాక్స్ పేయర్స్‌కి సమాచార నోటీసులు జారీ చేస్తారు. ఇలాంటి సమాచార నోటీసులు అందినట్లయితే వారి ఐటీఆర్ విజయవంతంగా ప్రాసెసింగ్ పూర్తయిందని అర్థం. ఏదైనా రిఫండ్ అమౌంట్ రావాల్సి ఉంటే అది బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. అయితే, చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఆర్థిక ఏడాది 2020-21కి సంబంధించిన ఐటీ రిటర్న్స్ ప్రాసెసింగ్ కోసం వేచి చూస్తున్నారు. ఆ ఆర్థిక ఏడాదికి సంబంధించిన ఐటీఆర్ ప్రాసెసింగ్ లో జాప్యం జరిగిన వాటికి ఇప్పుడు మోక్షం లక్షించనుంది. సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల వల్ల అసెస్మెంట్ ఇయర్ 2021-22కి సంబంధించిన కొన్ని ఐటీ రిటర్న్స్ ని ప్రాసెసింగ్ చేయలేదని గతంలోనే ఐటీ శాఖ తెలిపింది. సెక్షన్ 143 (1)లోని సబ్ సెక్షన్ (1) ప్రకారం వాటి ప్రాసెసింగ్ నిలిపివేసినట్లు తెలిపింది. దీని కారణంగా సరైన సమయానికి ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారికి సైతం రిఫండ్స్ అందలేదు. అయితే, ఇప్పుడు వాటి ప్రాసెసింగ్ కి డెడ్‌లైన్ ఫిక్స్ చేసింది ఐటీ శాఖ. ఏప్రిల్ 30 లోపు ప్రాసెస్ పూర్తి చేయనున్నట్లు మార్చి 1, 2024 రోజున ప్రకటన చేసింది.

# మరోసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తలపడనున్న జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్



అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్. బైడెన్ కంటే ముందు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే గత అమెరికా ఎన్నికల్లో బైడెన్, ట్రంప్ తలపడగా.. ట్రంప్‌పై బైడెన్ విజయం సాధించి అమెరికా అధ్యక్షుడు అయ్యారు. అయితే వచ్చే ఎన్నికల్లో కూడా బైడెన్, ట్రంప్ మరోసారి ప్రత్యర్థులుగా పోటీ చేసేందుకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే జరుగుతున్న రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో దూసుకుపోతున్న డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ముందువరుసలో ఉన్నారు. మరోవైపు.. డెమోక్రటిక్ పార్టీ తరఫున మరోసారి జో బైడెన్ బరిలోకి దిగేందుకు సిద్ధం అవుతున్నారు. అమెరికాలో మరికొన్ని రోజుల్లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ముందున్నారు. మంగళవారం ఒకేసారి 16 రాష్ట్రాల్లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో మరింత ముందుకు దూసుకెళ్లిన డొనాల్డ్ ట్రంప్.. అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిత్వాన్ని మరింత పదిలం చేసుకున్నారు. ఇక డెమోక్రటికన్న తరఫున మరోసారి జో బైడెన్.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. అయితే ఇది తేలాలంటే డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 12 వ తేదీ వరకు వేచి ఉండాల్సింది. అటు జో బైడెన్ ఈ నెల 19 వ తేదీ వరకు ఆగాల్సిందే. అప్పటికి అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఎవరో తేలిపోనుంది.
అయితే 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల లాగానే ఈసారి కూడా మళ్లీ డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్.. రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల తరఫున పోటీలో ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం జరిగిన ప్రైమరీ ఎన్నికలతో ఇది మరింత స్పష్టం అయింది. అయితే ఇందులో ఎవరు విజయం సాధించినా.. ఆయా పార్టీల ప్రధాన అభ్యర్థులకు సంఖ్యాబలం దృష్ట్యా ఇవి ఎంతో కీలకంగా మారనున్నాయి. అధ్యక్ష పదవికి అభ్యర్థులకు మద్దతు తెలపడంతోపాటు ఉత్తర కరోలినా, కాలిఫోర్నియా వంటి ప్రాంతాల్లో ఎవరిని గవర్నర్లుగా నియమించాలి అనేది కూడా ఈ ఫలితాలే నిర్ణయించనున్నాయి. అయితే జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ మరోసారి 2024 ఎన్నికల్లో తుది పోటీ దారులుగా ఉండటం అమెరికా ఓటర్లకు నచ్చడం లేదని తెలుస్తోంది. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అదే నిజం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బైడెన్, ట్రంప్‌ల గురించి ఏపీ-ఎన్‌వోఆర్‌సీ ప్రజా వ్యవహారాల పరిశోధన కేంద్రం నిర్వహించిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెల్లడి అయ్యాయి. వీరిద్దరిలో ఎవరికీ తగినంత మానసిక దృఢత్వం లేదని అమెరికా ప్రజల్లో ఎక్కువమంది భావిస్తున్నట్లు ఈ సర్వేలో బయటపడింది.

> **రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల తరఫున పోటీలో ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం జరిగిన ప్రైమరీ ఎన్నికలతో ఇది మరింత స్పష్టం అయింది. అయితే ఇందులో ఎవరు విజయం సాధించినా.. ఆయా పార్టీల ప్రధాన అభ్యర్థులకు సంఖ్యాబలం దృష్ట్యా ఇవి ఎంతో కీలకంగా మారనున్నాయి.**

మరోవైపు.. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ గురువారం అమెరికా ప్రజలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేయనున్నారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రభావం చూపే కీలక రాష్ట్రాలైన పెన్సిల్వేనియా, జార్జియాల్లో నిర్వహించనున్న ఎన్నికల ప్రచారంలో బైడెన్ పాల్గొనున్నారు. అమెరికాలో రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన, జీతాల పెంపు, డ్రగ్స్ వినియోగం తగ్గేలా చూడడం వంటి వాటిని తన విజయాలుగా అమెరికా ప్రజలకు జో బైడెన్ వివరించనున్నారు. ఇక రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న డొనాల్డ్ ట్రంప్.. అమెరికా ఫస్ట్ నినాదాన్ని అందుకున్నారు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా చేద్దాం అనే నినాదంతోనే ఈసారి కూడా ట్రంప్ వినిపించనున్నారు. అయితే ట్రంప్ చేస్తున్న ప్రచారానికి బదులుగా బైడెన్ ప్రచారం ఉంటుందని వైట్‌హౌస్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. మరోవైపు.. ఇప్పటికే రిపబ్లికన్ పార్టీ తరఫున అప్రతిహత విజయాలతో దూసుకెళ్తూ.. అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ముందు వరుసలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే 12 మందికిపైగా పైగా ప్రధాన పోటీదారులను ఓడించి విజయానికి మరింత దగ్గరయ్యారు. ఇక రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న నిక్కీ హేలీ ఒక్కరే మిగిలారు. నార్త్ కరోలినా రిపబ్లికన్ కాకస్‌లలో జరిగిన ఎన్నికల్లోనూ ట్రంప్ గెలుపొందారు.

# 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో పప్పు.. రెస్టారెంట్‌లో సరికొత్త వంటకం

బంగారం ఎక్కువగా ఉన్న వారిని సాధారణంగా ఏం అంటారు. అంత బంగారం ఎందుకు దాన్ని ఏమైనా తింటారా అని సరదాగా ఆటపట్టిస్తూ ఉంటారు. అయితే ఇది ఇప్పటివరకు కేవలం సామెతగానే ఉన్నా.. ఒక రెస్టారెంట్ మాత్రం సీరియస్‌గా తీసుకుంది. ఏకంగా బంగారంతో కర్రీలు ట్రై చేసింది. బంగారంతో దాల్ కర్రీ వండి ప్రస్తుతం సంచలనం సృష్టించింది. ఇంతకీ ఈ గోల్డెన్ దాల్ కర్రీ ఎలా ఉంటుంది. దాన్ని ఎలా తయారు చేస్తారు. ఆ కర్రీని ఎవరు తయారు చేశారు అనే విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.
రెస్టారెంట్లలో చెఫ్‌లు రోజు రోజుకూ రకరకాల వంటకాలు తయారు చేస్తూ ఉంటారు. ఆ వంటకాలను స్పెషల్ డిష్‌లుగా ప్రచారం చేస్తే.. వాటిని తినడానికి జనం ఎగబడిపోతూ ఉంటారు. తాజాగా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో చేసిన దాల్ ఫ్రై తయారీకి సంబంధఇంచిన ఓ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. బంగారంతో పప్పు కర్రీని వండడం చూసి నెటిజన్లు అవాక్కవుతున్నారు. దీనికి దాల్ కష్కన్ అని పేరు పెట్టారు. దుబాయ్ ఫెస్టివ్ సిటీ మాల్‌లో చెఫ్ రణ్ వీర్ బ్రార్.. ఈ దాల్ కష్కన్‌ను తయారు చేశారు. అయితే ఇలాంటి వంటకాలతో ఏంటి ఉపయోగం అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇక ఈ దాల్ కష్కన్‌కు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో 'స్ట్రీట్ ఫుడ్ రిసిప్' అనే అకౌంట్ నుంచి పోస్ట్ చేశారు. దుబాయ్ ఫెస్టివ్ సిటీ మాల్‌లో చెఫ్ రణ్‌వీర్ బ్రార్ తయారు చేశారని.. దానికి 24 క్యారెట్ గోల్డెన్ తడ్కే వాలీ దాల్ అని క్యాప్షన్ కూడా ఇచ్చారు. ఇక ఈ దాల్ కష్కన్ ధర 58 దిర్హామ్‌లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1300 ఉంటుందని తెలిపారు. ఇక ఈ దాల్ కష్కన్




తయారీలో నూనేను వాడలేదు. ఆ స్థానంలో బంగారం పూతను ఉపయోగించారు. అయితే ఈ దాల్ కష్కు తయారీకి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారుతుండటంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. బంగారంతో తయారు చేసిన దాల్ కర్రీ శరీరంలో ఎలా వెళ్తుందని.. ప్రశ్నిస్తున్నారు. ఇక మరికొందరు నెటిజన్లు.. ఈ దాల్ కర్రీని తినాలా లేక భద్రంగా దాచుకోవాలా అని అడుగుతున్నారు. వెల్‌కమ్ టు హెవీ మెటల్ పాయిజన్ అంటూ మరొకరు కామెంట్ చేశారు. రేడియం కా తడ్కా ప్రయత్నించండి అని మరొకరు ట్వీట్ చేశారు. ప్రజలు రోజు రోజుకూ పిచ్చివాళ్లు అయిపోతున్నారన మరో నెటిజన్ ఫైర్ అయ్యాడు. ఇక దుబాయ్‌లో ఆహార పదార్థాల్లో బంగారాన్ని కలిపి వండడం చాలా సర్వసాధారణం. ఐస్‌క్రీమ్‌ల నుంచి చాక్లెట్ల వరకు.. అన్ని రకాల ఆహార పదార్థాల్లో బంగారం పొడిలా చేసి ఉపయోగిస్తారు. హార్డ్ రాక్ కేఫ్‌లో బంగారు బర్గర్‌లను తయారు చేస్తారు. ఆ కేఫ్‌లో స్టీక్ ప్యాటీ అనే బర్గర్‌ను 24 క్యారెట్ల బంగారంతో తయారు చేస్తారు. ఇక స్కూఫీ అనే మరో రెస్టారెంట్‌లో బంగారంతో తయారు చేసిన బ్లాక్ చార్‌కోల్ ఐస్‌క్రీమ్ దొరుకుతుంది. ఈ ఐస్‌క్రీమ్ ధర 3 వేల దిర్హామ్‌లు అంటే భారత కరెన్సీలో అక్షరాలా రూ.67715 ఉంటుంది. ఇక సాఫ్నా ఎడ్డార్ రెస్టారెంట్‌లో బంగారు ట్రే, బంగారు స్పూన్, గోల్డెన్ బోన్ చైనా కప్‌పై 24 క్యారెట్ల బంగారంతో కాఫీ తయారు చేస్తారు.

# విమానం వదిలేసి డెలివరీ చేసిన పైలట్.. చివరికి ఏం జరిగిందంటే?

విమానంలో ప్రయాణించే ప్రయాణికులకు.. ప్రయాణం మధ్యలో అస్వస్థత, అనారోగ్యం రావడం జరుగుతూనే ఉంటాయి. అలాంటి సమయంలో విమానంలో ఉండే సిబ్బంది వారికి చికిత్స అందిస్తూ ఉంటారు. ఇంకా ఏవైనా పెద్ద ఆరోగ్య సమస్యలు ఎదురైతే అత్యవసర ల్యాండింగ్ చేసి వారిని హాస్పిటల్‌కు తరలిస్తారు. కానీ తాజాగా ఓ విమానంలో ప్రయాణిస్తున్న గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో పైలట్ వచ్చి డెలివరీ చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఇంతకీ ఈ సంఘటన ఎక్కడ జరిగింది. డెలివరీ తర్వాత ఆ తల్లీబిడ్డలు ఎలా ఉన్నారు. అసలు ఆ పైలట్ డెలివరీ ఎలా చేశారు. విమానం గాల్లో ఉండగా అనారోగ్య సమస్యలు తలెత్తడం, హెల్త్ ఎమర్జెన్సీ రావడం మనం ఇప్పటివరకు ఎన్నోసార్లు చూశాం. అలాంటి సమయంలో ఆ విమానంలో ఉన్న ప్రయాణికుల్లో ఎవరైనా డాక్టర్లు ఉంటే ప్రథమ చికిత్స చేసి వారి ప్రాణాలు కాపాడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. డాక్టర్లు ఎవరూ లేకపోతే ఆ విమానాన్ని దగ్గర్లో ఉన్న ఎయిర్‌పోర్టుల్లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసి.. వారిని హుటాహుటిన ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తూ ఉంటారు. అయితే తాజాగా విమానంలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలికి ఆ విమానం గాల్లో ఉండగా.. పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆ విమానాన్ని నడుపుతున్న పైలట్ రంగంలోకి దిగాడు. ఆ మహిళకు ప్రసవం చేసి బిడ్డను బయటికి తీశాడు. దీంతో ఆ విమానంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అంతా ఆ పైలట్ చేసిన పనికి ప్రశంసల జల్లు కురిపించారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళకు విమానంలోనే ఓ పైలట్ సక్సెస్‌ఫుల్‌గా డెలివరీ చేసి.. తల్లీబిడ్డలను కాపాడాడు. తైవాన్ నుంచి బ్యాంకాక్‌కు బయల్దేరిన వీట్‌జెట్‌కు చెందిన ఒక విమానంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆ విమానం గాల్లోకి ఎగిరిన కొద్ది సేపటికి అందులో ప్రయాణిస్తున్న ఓ గర్భిణీకి నొప్పులు ప్రారంభం అయ్యాయి. ఆ తర్వాత ఆ పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో బాత్‌రూంకు వెళ్లింది. అయితే ఆమె పరిస్థితిని చూసిన విమాన సిబ్బంది.. విషయాన్ని ఆ విమానం పైలట్ అయిన జాకరిన్‌కు తెలిపారు. అయితే ఆ విమానం ల్యాండింగ్ కావడానికి సమయం ఉండటం, ఆ విమానంలో ఎవరూ డాక్టర్లు అందుబాటు లో ఉండకపోవడంతో వెంటనే ఆ విమానం నడిపే బాధ్యతను జాకరిన్ తన కో-పైలట్‌కు అప్పగించాడు. వెంటనే తనకు తెలిసిన డాక్టర్లకు ఫోన్ చేసిన జాకరిన్.. గర్భిణీ పరిస్థితిని వారికి వివరించాడు. ఈ క్రమంలోనే వారు ఇచ్చిన సూచనలతో ఈ మహిళకు ప్రసవం చేయడం ప్రారంభించాడు. ఆ డాక్టర్లు చెప్పిన సూచనలు, విమా నంలో ఉన్న ఇతర ప్రయాణికుల సహాయంతో ఆ మహిళకు విజయవంతంగా ప్రసవం చేసి.. మగబిడ్డను బయటికి తీశాడు. దీంతో ఆ విమానంలో ఉన్న ప్రయాణికులు అంతా జాకరిన్ చూపించిన సమయ స్ఫూర్తికి ప్రశంసలు కురిపించారు. ఇక విమానం బ్యాంకాక్‌కు చేరుకోగానే.. ఆ తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలిం చి తర్వాతి చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరూ సురక్షితంగా ఉన్నారని డాక్టర్లు తెలిపారు. ఇక ఆ విమానం గాల్లో ఉండగా.. జన్మించిన మగ శిశువుకు 'స్కై బేబీ' అని పేరు కూడా పెట్టారు. ఈ విషయాన్ని జాకరిన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిం చాడు. తాను 18 ఏళ్లుగా పైలట్‌గా విధులు నిర్వర్తి స్తున్నా.. ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు ఎదురుకా లేదని తెలిపాడు. అయినప్పటికీ డాక్టర్ల సహాయంతో ఆ మహిళకు సక్సెస్‌ఫుల్‌గా డెలివరీ చేసినట్లు చెప్పాజు. 2020 లో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ట్రావెల్ మెడిసిన్ నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం.. 1929 నుంచి 2018 మధ్య విమానాల్లో ఇలాంటి డెలివరీ ఘటనలు జరిగాయి. అందులో మొత్తం 74 మంది చిన్నారులు జన్మించగా.. వారిలో 71 మంది సురక్షితంగా ఉన్నట్లు వెల్లడైంది.

# ఈ జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలి







మేకప్ అంటే అమ్మాయిలకు ఎంతిష్టమో స్పెషల్‌గా చెప్పనవరం లేదు. పార్టీలు, ఫంక్షన్స్ ఉన్నప్పుడైతే మేకప్ తప్పని సరి. ఇష్టంతోనే కాదు.. కొందరు వృత్తిలో భాగంగానూ రోజూ మేకప్ వేసుకోవలసి ఉంటుంది. రోజూ మేకప్ వేసుకుంటే.. అది చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మేకప్ ఉత్పత్తుల్లో కెమికల్స్ కారణంగా చర్మం దెబ్బతింటుంది. మేకప్ కారణంగా చర్మం పొడిబారడం, మొటిమలు, వృద్ధాప్య ఛాయలు త్వరగా రావడం వంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ప్రీ, పోస్ట్ మేకప్ తీసుకుంటే.. మేకప్ నుంచి చర్మాన్ని రక్షించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. చర్మాన్ని మేకప్ నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

సరైన బేస్ ఎంచుకోండి..

మీ రు మేకప్ వేసుకునేముందు, చర్మానికి సరైన బేస్ అప్లై చేయడం చాలా ముఖ్యం. పగటిపూట.. ఫౌండేషన్, క్రీమ్‌ను ధరించే ముందు ప్రైమర్ లాంటి ముగింపుని ఇచ్చే మాయిశ్చరైజర్‌లు, సన్‌స్క్రీన్‌లు అప్లై చేసుకోవడం చాలా ముఖ్యం. సాయంత్రం పూట మేకప్ వేసుకుంటుంటే.. నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌లను ఉపయోగించి చర్మాన్ని హైడ్రేట్ చేయడం ముఖ్యం, దాని తర్వాత.. మేకప్ ఎక్కుసేపు ఉండటానికి.. జెల్ ఆధారిత ప్రైమర్‌ను అప్లై చేయండి.

మేకప్ ఉత్పత్తులకు రంగు, సువాసన ఇవ్వడానికి వాటిలో విషపూరితమైన కెమికల్స్ వాడే అవకాశం ఉంది. ఈ కెమికల్స్ మీ చర్మానికి హాని చేస్తాయి. మీ మేకప్ ఉత్పత్తులలో హానికరమైన కెమికల్స్ లేకుండా జాగ్రత్తపడండి. పారాబెన్స్, ఫార్మాల్డిహైడ్, పాదరసం, థాలేట్స్, సీసం, సమ్మేళనాలు ఎండోక్రైన్ వ్యవస్థలు, సంతానోత్పత్తికి అంతరాయం కలిగిస్తాయి. ఈ కెమికల్స్ కారణంగా.. క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతుంది. మీరు సాధ్యమైనంత వరకు సహజ ఉత్పత్తులు వాడటానికి ప్రయత్నించండి. మీ చర్మానికి మాత్రమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా సురక్షితమైన మేకప్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం.

మేకప్ బ్రష్‌లను శుభ్రం చేయండి.. మేకప్ అప్లై చేయడానికి ఉపయోగించే బ్రష్‌లు, స్పాంజ్‌లు, అప్లికేటర్‌లను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మీ మేకప్ బ్రష్‌లను యాంటిసెప్టిక్ లిక్విడ్ సబ్బుతో డీప్ క్లీన్ చేయాలి. బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్ ఉపయోగించి స్పాంజ్‌లను శుభ్రం చేసుకోవాలి. స్పాంజ్‌లను బ్యూటీ బ్లెండర్ క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవచ్చు. ఇవి స్పాంజ్‌ల నుంచి కన్సీలర్, ఫౌండేషన్ మరకలను తొలగిస్తుంది. ప్రతిరోజూ మేకప్ వేసుకునే వారు.. వారానికి రెండుసార్లు మేకప్ బ్లష్‌లను శుభ్రం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్రష్‌లు, స్పాంజ్‌లను ఆరబెట్టడానికి హెయిర్‌డ్రైర్‌ను ఉపయోగించవచ్చు.

మేకప్ శుభ్రంగా రిమూవ్ చేయండి.. మేకప్‌ను సరిగ్గా రిమూవ్ చేయకపోతే.. చర్మ సమస్యలు ఎదురవుతాయి. మేకప్ తొలగించుకునే క్రమంలో రిమూవర్ ఉపయోగించినా.. గట్టిగా రుద్దుతూ మరీ శుభ్రం చేసుకుంటారు కొంతమంది. అయితే ఇలా చేయడం వల్ల చర్మం డ్యామేజ్ అయ్యే ప్రమాదమే ఎక్కువ అంటున్నారు నిపుణులు. అందుకే నెమ్మదిగా తొలగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చర్మానికి జిడ్డుగా అతుక్కుపోయిన మేకప్‌ను ముందుగా కరిగించాల్సి ఉంటుంది. ఇందుకోసం మేకప్‌ను తొలగించే క్లెన్సర్లు బయట దొరుకుతాయి. కాస్త ఎక్కువగా మేకప్ వేసిన భాగంలో ఈ కాటన్‌ని కొన్ని సెకన్ల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల మేకప్ కరిగిపో తుంది. అప్పుడు తొలగించడం సులభమవు తుంది. ఆ తర్వాత. . ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను చేతు ల్లోకి తీసుకొని ముఖా నికి, మెడకు బాగా పట్టించి 2-3 నిమిషాల తర్వాత కాటన్ ప్యాడ్లతో తుడిచేసుకుంటే సరి. లిప్‌స్టిక్‌ను సైతం కొబ్బరినూనెతో ఇలాగే తొలగించుకోవచ్చు. కొన్ని రకాల మేకప్ రిమూవర్స్ చర్మంలోని సహజ సిద్ధమైన నూనెల్ని తొలగిస్తాయి. ఇలాంట ప్పుడు మేకప్ తొలగించుకొని, ముఖం శుభ్రం చేసు కున్న తర్వాత చర్మానికి మాయిశ్చరైజర్ అప్లై చేయడం తప్పనిసరి. ఇక పెదాలకు లిప్‌బామ్, కళ్లకు ఐ క్రీమ్.. వంటివీ ఆయా భాగాల్ని తేమగా ఉంచేందుకు తోడ్పడతాయి.

# ముఖం మెరుస్తుందట..









ముఖం అందంగా కనిపించాలని చాలా మంది రోజ్‌వాటర్ రాస్తుంటారు. కానీ, అందులో బంగాళాదుంప రసం కలిపి ముఖానికి రాస్తే మరింత కాంతివంతంగా మారుతుంది. పూర్తి వివరాలు తెలుసుకోండి. ఈ రెండింటిని కలిపి రాస్తే మొటిమలు, మచ్చలు తగ్గి ముఖం మెరుస్తుందట.. సాధారణంగా ముఖంపై మచ్చలు పోగొట్టి అట్రాక్టివ్‌గా కనిపించాలంటే బంగాళాదుంప రసం హెల్ప్ చేస్తుంది. దీని వల్ల చర్మానికి మేలు జరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, విటమిన్స్ చర్మాన్ని చక్కగా కనిపించేలా చేస్తాయి.

బంగాళాదుంప, రోజ్‌వాటర్..

బంగాళాదుంప రసం, రోజ్ వాటర్ కలిపి ముఖానికి అప్లై చేస్తే చర్మానికి మేలు జరుగుతుంది. అవేంటి? ఈ రెండింటిని కలిపి ఎలా అప్లై చేయాలి. వీటి వల్ల కలిగే లాభాలు ఏంటో పూర్తిగా తెలుసుకోండి.

మొటిమలు.. ఈ రెండింటిని కలిపి రాస్తే ముఖంపై మొటిమల సమస్య కూడా తగ్గుతుంది. రెండింటిని బాగా కలిపి ముఖానికి అప్లై చేసి తర్వాత సాధారణ నీటితో కడగాలి. ఇలా చేస్తే మొటిమల సమస్య తగ్గుతుంది.

పిగ్మంటేషన్.. మీ చర్మం నల్లగా ఉంటే బంగాళాదుంప రసం, రోజ్ వాటర్ రెండూ కూడా డార్క్ స్కిన్‌ని దూరం చేస్తుంది. చర్మం నల్లబడడం, పిగ్మంటేషన్ రెండింటిని దూరం చేస్తాయి. ఇందుకోసం రెండింటిని కలిపి చర్మానికి అప్లై చేసి 10 నుండి 15 నిమిషాల పాటు అలానే ఉంచి చర్మాన్ని క్లీన్ చేయండి. ఇక చర్మంపై ఏర్పడిన మచ్చల్ని తగ్గించడంలోనూ రోజ్ వాటర్, బంగాళాదుంప జ్యూస్ హెల్ప్ చేస్తుంది. ఈ రెండింటిని ఓ గిన్నెలో కలిపి అందులోనే పసుపు రాయండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి 20 నిమిషాల తర్వాత ముఖాన్ని క్లీన్ చేస్తే మచ్చలు తగ్గి ముఖం కాంతివంతంగా మారతుంది.

# ఈ స్నాక్స్ తింటే.. బరువు కంట్రోల్‌లో ఉంటుంది..!

శీతాకాలంలో కొంతమంది బరువు పెరుగుతుంటారు. వాతావరణం చల్లగా ఉండటం, చలి వంటి కారణాల వల్ల.. వ్యాయమం చేయడానికి చాలామంది బద్ధకిస్తూ ఉంటారు. అంతేకాదు, ఈ సీజన్‌లో జీవక్రియ పనితీరు నెమ్మదిస్తుంది. దీంతో శరీరంలో పేరుకున్న ప్యాట్ కరగడానికి చాలా కష్టం అవుతుంది. దీంతో చాలామంది బరువు పెరుగుతారు. బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడానికి మన డైట్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సీజన్ కొన్ని హెల్తీ స్నాక్స్ మన డైట్‌లో చేర్చుకుంటే.. బరువును కంట్లోల్‌లో ఉంచడానికి సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. వీటిలో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి మీ ఆకలని కంట్రోల్‌లో ఉంచుతాయి, కేలరీ ఇన్‌టేక్ తగ్గిస్తాయి. తద్వారా బరువు కంట్రోల్‌లో ఉంటుంది. అంతకాదా, బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచడానికి, రోజంతా మిమ్మల్ని యాక్టివ్‌గా ఉంచడానికీ తోడ్పడతాయి.?

వేయించిన శనగలు.. మీ బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడానికి, బరువు తగ్గించుకోవడానికి.. వేయించిన శనగలు బెస్ట్ స్నాకింగ్ ఆప్షన్. సెనగల్లోని ప్రొటీన్, ఫైబర్ కలిసి నెమ్మదిగా జీర్ణం కావడంతోపాటు ఆకలికి సంబంధించిన హార్మోన్ శాతాన్ని తగ్గిస్తాయి. ఫలితంగా క్యాలరీల శాతం తగ్గడంతో సెనగల్ని తినేవాళ్లలో బరువుతోపాటు నడుం చుట్టుకొలత కూడా తగ్గిందని నిపుణులు అంటున్నారు. సెనగల్లోని ఫైబర్ మలబద్ధకం సమస్యను దూరం









చేస్తుంది. ఫైబర్ పొట్టలోని బ్యాక్టీరియాను ఆరోగ్యంగానూ ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌నీ తగ్గిస్తుంది.

బ్రెర్లీలు, యోగర్ట్.. యోగర్ట్‌లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది.. ఇది కణజాలాలను నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్ రిచ్ బెర్రీలను పెరుగులో యాడ్ చేసుకుని తింటే.. శరీరానికి అవసమైన విటమిన్లు, మినరల్స్ అందిస్తుంది. గట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

డార్క్ చాక్లెట్.. డార్క్ చాక్లెట్‌లో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. రా కోకో పౌడర్, 80-90 శాతం డార్క్ చాక్లెట్ ఉన్నవే ఎంచుకోండి. ఇది చెడు కొవ్వును తగ్గించడమే కాదు రోగనిరోధక శక్తినీ పెంచుతుంది. రోజుకి 1 లేదా 2 క్యూబ్స్ తీసుకుంటే చాలు.

ఆల్మండ్ బటర్, యాపిల్ ముక్కలు.. యాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఫైబర్ మీ కడుపును నిండుగా ఉంచుతుంది, తద్వారా మీ అతిగా తినకుండా కంట్రోల్‌లో ఉంచుతుంది. ఇది మీరు బరువు పెరగకుండా సహాయపడుతుంది. ఆల్మెండ్ బటర్‌లోని ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి.

వేయించిన నట్స్.. బాదం, వాల్‌నట్స్, జీడిపప్పులు, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌లో పోషకాలు అధికంగా ఉంటాయి. రోజూ గుప్పెడు వేయించిన డ్రై ఫ్రూట్స్ తింటే.. మీ కడుపు నిండుగా ఉంటుంది. ఈ గింజల్లోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు మీ బరువును కంట్రోల్‌లో ఉంచడానికి సహాయపడతాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గించి.. మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

ఉడకబెట్టిన చిలగడదుంపలు.. చిలగడ దుంపల్లో బీటా-కెరొటిన్, విటమిన్-ఈ, సి, బి-6, పొటాషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. వీటిల్లో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది. ఈ దుంపల్లో మనకి అవసరమైన ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది శరీర కణాల సామర్థ్యాన్ని పెంచి అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరాని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా రోగ నిరోధక వ్యవస్థకు కీలకమైన తెల్లరక్తకణాల ఉత్పత్తికి సాయపడతాయి. వీటిలో ఉండే కెరొటెనాయిడ్స్ యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తూ రక్తంలో చక్కెర స్థాయిని, ఇన్సులిన్‌ను నియంత్రిస్తాయి. తద్వారా తిన్న పదార్థాలు కొవ్వుగా మారకుండా చేస్తాయి. ఇవి స్నాక్ రూపంలో తీసుకుంటే.. మీ బరువు కంట్రోల్‌లో ఉంటుంది.

# జాబ్ ఇంటర్వ్యూకు వెళ్లే ముందు.. ఈ 5 ఫుడ్స్ అసలు తినొద్దు..!



మీ డ్రీమ్ జాబ్ ఇంటర్వ్యూ కోసం మీరు చాలా బాగ రెడీ అయ్యారు. ఆ జాబ్ మీకే వస్తుంది అనే నమ్మకంతో ఉన్నారు. ఇంటర్వ్యూ చేసే వారి ఎదుట చాలా కాన్ఫిడెంట్‌గా కూర్చున్నారు. అంతా మీరు అనుకున్నట్లే జరుగుతుంది, ప్రతీది కరెక్ట్‌గా ఉంది అనుకునే సమయంలో.. మీ పొట్టలో గడబిడగా ఉన్నట్లు, కడుపులో నుంచి శబ్దాలు, నోటి నుంచి బ్రేవ్ మనే సౌండ్స్ వస్తే.. ఇంటర్వ్యూ చేసే వ్యక్తి మిమ్మల్ని వింతగా, అశ్చర్యంగా చూస్తూ ఉంటారు. ఈ పరిస్థితి మీకు ఎబ్బెట్టుగా అనిపించవచ్చు. మీరు ఇంటర్వ్యూకు వచ్చే ముందు తిన్న ఆహారం వల్ల ఈ వింత పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. ఇబ్బందికర పరిస్థితులను నివారించడానికి ఇంటర్వ్యూకు వెళ్లే ముందు పూర్తిగా నివారించాల్సిన కొన్ని ఆహారాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి.. ఉల్లిపాయలు, వెల్లుల్లి దాదాపు అన్ని వంటల్లో ఉంటాయి. అయితే, జాబ్ ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు.. ఉల్లిపాయ, వెల్లుల్లి ఉన్న వంటకాలను తినకుండా ఉండటం మంచిది. ఈ రెండు ఆహారాలకు



ఘాటైన వాసన ఉంటుంది, ఇవి నోటిద దర్వాసనకు కారణం అవుతాయి. మీ నోటి నుంచి దుర్వాసన వస్తే.. మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసే వ్యక్తికి మీపై చెడు అభిప్రాయం కలుగిస్తుంది, మీరు శుభ్రంగా ఉండరనే అభిప్రాయం వారికి కలుగుతుంది. ఉల్లిపాయ, వెల్లుల్లి కడుపు ఉబ్బరం, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలను కూడా కలిగిస్తాయి. ఒకవేళ మీరు ఇంటర్వ్యూకు ముందు వాటిని తిన్నా.. కచ్చితంగా బ్రష్ చేసుకోండి.



వేయించిన ఆహారం.. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు వేయించిన ఆహారాన్ని నివారించండి. వేయించిన ఆహార పదార్థాల్లో.. నూనె ఎక్కువగా ఉంటుంది. ఇది అజీర్ణం, వికారం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అవి మీ కడుపులో రంబ్లింగ్ శబ్దాలను కూడా కలిగిస్తాయి, ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మీ ఇంటర్వ్యూకు వెళ్లే ముందు కచోరీ, ఫ్రెంచ్ ఫ్రైస్, పకోడి వంటి ఫ్రైడ్ ఫుడ్స్ తినొద్దు.



కెఫిన్.. చాలామంది ఇంటర్వ్యూలో యాక్టివ్‌గా సమాధానాలు చెప్పడానికి, రిఫ్రెష్‌గా ఉండటానికి.. కాఫీ, టీ లాంటి కెఫిన్ డ్రింక్స్ తాగుతుంటారు. అయితే, ఇంటర్వ్యూకు వెళ్లే ముందు ఇవి తాగితే.. మీ ఏకాగ్రత దెబ్బతింటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వాటికి పూర్తిగా దూరం పెట్టడం మంచిది.



షుగర్ ఫుడ్స్.. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు.. స్వీట్స్, కేక్‌లు, డోనట్స్, చాక్లెట్స్, క్యాండీలు వంటి.. చక్కెర అధికంగా ఉండే ఫుడ్స్ తినొద్దు. ఇవి వికారం, వణుకుతున్న అనుభూతిని కలిగిస్తుంది. వాటికి బదులు ప్రొటీన్, ఫైబర్ రిచ్ ఫుడ్స్ తీసుకోండి. ఇవి మమ్మల్ని యాక్టివ్‌గా ఉంచుతాయి.కార్బోనేటేడ్ డ్రింక్స్.. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు.. కార్బోనేటేడ్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. వీటిలో చక్కెరతో పాటు కార్బన్ డై ఆక్సైడ్ కూడా ఉంటుంది. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. దీనికారణంగా గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురవుతాయి.

# ప్రశంసలు..





సూపర్ స్టార్ మహేష్ బాబు చిన్న సినిమాలను సపోర్ట్ చేయడానికి, టాలెంట్ ను ఎంకరేజ్ చేయడానికి ఎప్పుడూ ముందే ఉంటారు. ప్రమోషనల్ కంటెంట్ రిలీజ్ చేయడమే కాదు, సినిమా నచ్చితే వెంటనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తనవంతు ప్రచారం కల్పిస్తుంటారు. ఆయన రివ్యూల కోసం వేచి చూసే సినీ అభిమానులు, ప్రేక్షకులు ఉన్నారు. తాజాగా ‘ యుఫోరియా ’ సినిమాకి మహేష్ రివ్యూ ఇచ్చారు. ఇది తప్పక చూడాల్సిన సినిమా అని పేర్కొంటూ, చిత్ర బృందాన్ని అభినందించారు.

భూమిక చావ్లా, ధురంధర్ ఫేమ్ సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ‘యుఫోరియా ’. గుణ హ్యాండ్ మేడ్ ఫిలిమ్స్ బ్యానర్ లో నీలిమ గుణ, యుక్తా గుణ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 6న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేశారు. ఈ సినిమా చూసిన మహేష్ బాబు ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ”గుణశేఖర్ గారు తన కథలను ప్రెజెంట్ చేయడంలో ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన నమూనా ఉంటుంది. ‘యుఫోరియా’ సినిమాని ఎంజాయ్ చేశా. ముఖ్యంగా క్లైమాక్స్ చాలా బాగా నచ్చింది. తప్పక చూడండి. గుణశేఖర్ గారికి అభినందనలు. భూమికతో సహా మొత్తం టీంకి కంగ్రాట్స్” అని మహేష్ అన్నారు.

# టీజర్ రిలీజ్





శ్రీవిష్ణు హీరోగా శ్రీహుసేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ‘మృత్యుంజయ్’. తాజాగా ఈ మూవీ టీజర్‌ను దర్శకుడు రాజమౌళి విడుదల చేశారు. టీజర్ చాలా బాగుందని, హీరో సత్యాన్ని వెంబడిస్తున్నట్లుగా ఉందంటూ రాజమౌళి ప్రశంసించారు. ‘సామజవరగమన’ తర్వాత శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ కలిసి నటిస్తున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్.. ఫిబ్రవరి 27న థియేటర్లలో విడుదల కానుంది.

శ్రీవిష్ణు హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ ‘ మృత్యుంజయ్ ’. ఇందులో రెబా మోనికా జాన్ హీరోయిన్ గా నటించింది. ‘సామజవరగమన’ తర్వాత వీరిద్దరూ కలిసి నటించిన సినిమా ఇది. శ్రీహుసేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం.. ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయింది. ఫిబ్రవరి 27న థియేటర్లలో విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. ‘మృత్యుంజయ్’ టీజర్ ను ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. చిత్ర యూనిట్ కి తన బెస్ట్ విషెస్ అందజేశారు. ”మృత్యుంజయ్ టీజర్ ని రూపొందించిన విధానం చాలా నచ్చింది.. అతను సత్యాన్ని వెంబడిస్తున్నట్లు అనిపిస్తుంది. విష్ణు, హుస్సేన్, సన్నీలకు శుభాకాంక్షలు. ఫిబ్రవరి 27 కోసం ఎదురు చూస్తున్నాను” అని రాజమౌళి ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ‘మృత్యుంజయ్’ టీజర్ చూస్తుంటే, ఇదొక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ అని తెలుస్తోంది. ఇందులో శ్రీవిష్ణు రెండు కోణాల్లో సాగే పాత్రలో కనిపిస్తారని అర్థమవుతోంది. రెబా మోనికా జాన్ పోలీసు ఆఫీసర్‌గా కనిపించారు.

యంగ్ హీరో సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన తాజా చిత్రం ‘హే భగవాన్’. బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పణలో బి. నరేంద్ర రెడ్డి నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు గోపీ అచ్చర మీడియాతో మాట్లాడారు. ‘సుహాస్ నాకు బాల్య మిత్రుడు. నటుడిగా సుహాస్ బలం కామెడీనే అయినా, ఈ సినిమాలో తన పాత్ర ప్రేక్షకుల అంచనాలను తలకిందులు చేసేలా ఉంటుంది. ఇంతవరకూ తను చేసిన పాత్రలకు భిన్నంగా, ఆద్యంతం నవ్విస్తూనే, సరికొత్త మేకోవర్‌లో కనిపిస్తాడు. సుహాస్ ఇమేజ్‌ను మార్చే చిత్రమిది. మన నిత్య జీవితంలో ఎదురయ్యే ఇబ్బందికర పరిస్థితుల్లో వచ్చే ‘హే భగవాన్’ అనే పలుకును ఈ సినిమాకు టైటిల్‌గా పెట్టాం.

సినిమాలో పాత్రలకు కూడా అలాంటి ఘటనలే ఎదురవుతాయి. ఆరంభం నుంచి పతాక సన్నివేశాల వరకూ ఆద్యంతం నవ్వులు పంచుతూనే, చివరలో తండ్రీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌తో గుండెల్ని బరువెక్కిస్తాం. నిర్మాత సహకారంతో 36 రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేశాం. కుటుంబం అంతా కలసి చూసేలా మా సినిమా ఉంటుంది’ అని గోపీ చెప్పారు.

# నవ్విస్తుంది



థియేటర్లకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ ‘ఫంకీ’ విపరీతంగా నవ్విస్తుంది. అందరినీ అలరించి ఘన విజయం సాధిస్తుంది’ అని విశ్వక్ సేన్ అన్నారు.

నా ప్రతీ సినిమా విడుదలకు ముందు చాలా టెన్షన్ ఉంటుంది. కానీ ‘ఫంకీ’ విడుదలకు ముందు మాత్రం చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఈ సినిమాను మీరంతా బాగా ఎంజాయ్ చేస్తారు. మంచి హిట్టు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఇంత అద్భుతమైన కథ నా దగ్గరకు వచ్చింది. థియేటర్లకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ ‘ఫంకీ’ విపరీతంగా నవ్విస్తుంది. అందరినీ అలరించి ఘన విజయం సాధిస్తుంది’ అని విశ్వక్ సేన్ అన్నారు.

ఈ కార్యక్రమంలో అనుదీప్ కేవీ మాట్లాడుతూ ‘ఫంకీ’ పూర్తిస్థాయి కుటుంబ చిత్రం. ప్రారంభం నుంచి చివరి వరకూ వినోదాత్మకంగా ఉంటుంది’ అని చెప్పారు. ‘ఫంకీ’ మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది. ఇందులో నేను పోషించిన చిత్ర పాత్రపై ప్రేమ కురిపిస్తారని కోరుకుంటున్నాను’ అని చిత్ర కథానాయిక కయాదు లోహర్ తెలిపారు. చివరలో జై ఎన్టీఆర్ అంటూ అక్కడికి వచ్చిన వారిలో జోష్ నింపారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# కనెక్ట్ అయ్యేలా



లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ జంటగా నటించిన సినిమా ‘సతీ లీలావతి’ తాతినేని సత్య దర్శకత్వంలో ఈ సినిమాను నాగ మోహన్ నిర్మించారు. మార్చి 6న ఈ మూవీని విడుదల చేయబోతున్నట్టు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలిపారు.

ఈ సందర్భంగా లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ, ‘సతీ లీలావతి మూవీని ప్రారంభించినప్పుడు నేను గర్భవతిని. కేవలం మూడు నెలల్లోనే షూటింగ్ పూర్తి చేశాను. దర్శక, నిర్మాతల సపోర్ట్ వల్లే నేను నటించగలిగాను. సప్తగిరి గారితో పని చేయడం ఆనందంగా ఉంది. దేవ్ మోహన్ గారి నటన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఈ సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు. తాతినేని సత్య మాట్లాడుతూ, ‘కమల్ హాసన్ గారు చేసిన ‘సతీ లీలావతి’తో మాత్రం నా సినిమాని పోల్చను. అయితే అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను తీశాను’ అని చెప్పారు.

‘పాత ‘సతీ లీలావతి’ ఎంత పెద్ద హిట్ అయ్యిందో ఈ సినిమా కూడా అంత హిట్ కావాలని కోరుకుంటున్నా’నని నటుడు సప్తగిరి అన్నారు. నిర్మాతగా తనకిది మొదటి చిత్రమని, ఈ సినిమా ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నానని, వరల్డ్ వైడ్ మార్చి 6న సినిమాను విడుదల చేయబోతున్నామని నిర్మాత నాగ మోహన్ చెప్పారు. ఇందులో నరేష్, వీటీవీ గణేష్, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, జోషి తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు.

# రష్మిక బాటలో



కన్నడ సోయగాలు టాలీవుడ్‌లో జెండా పాతడం కొత్తేమీ కాదు. గతంలో సౌందర్య నుంచి నేటి రష్మిక వరకు ఎందరో కన్నడ భామలు తెలుగు తెరపై స్టార్‌లుగా వెలిగిపోయారు.

టాలీవుడ్ ఇచ్చే ఆదరణ, ఇక్కడ దక్కే రెమ్యూనరేషన్ వారిని ఇటు వైపు ఆకర్షిస్తున్నాయి. తాజాగా మరో కన్నడ సుందరి రుక్మిణి వసంత్ ఇప్పుడు ఇండస్ట్రీ హాట్ టాపిక్‌గా మారింది.రష్మిక మందన్న విషయానికొస్తే, ఆమె ఇక్కడ స్టార్‌గా ఎదగడమే కాకుండా నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందింది. అయితే తన మాతృభాష కంటే తెలుగు చిత్రాలకే ఆమె పెద్దపీట వేస్తోందనే నెపం కన్నడ అభిమానుల్లో ఉంది. ఇదే కారణంతో సోషల్ మీడియాలో ఆమెపై తరచూ విమర్శలు వస్తుంటాయి. అయినప్పటికీ ఆ ప్రతికూలతలను దాటుకుంటూ రష్మిక తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తోంది. ఇప్పుడు రుక్మిణి వసంత్ ప్రయాణం కూడా రష్మిక బాటలోనే సాగుతున్నట్లు కనిపిస్తోంది.సప్త సాగరాలు దాటి’ చిత్రంతో యువత మనసు దోచుకున్న ఈమె, ఇప్పుడు ఏకంగా ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ క్రేజీ ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకుంది. ఈ భారీ ఆఫర్‌తో ఆమె పేరు ఒక్కసారిగా పాన్ ఇండియా స్థాయిలో మారుమోగిపోతోంది. ఒకవైపు తెలుగులో ఇంతటి గుర్తింపు తెచ్చుకుంటూనే, మరోవైపు ‘కాంతార చాప్టర్ 1’తో కన్నడలోనూ స్టార్ హోదాను దక్కించుకుంది. మాతృభాషలో స్టార్ హోదాను కాపాడుకుంటూనే, టాలీవుడ్‌లో టాప్ లీగ్ హీరోయిన్‌గా ఎదిగేందుకు ఆమె పావులు కదుపుతోంది. ప్రస్తుత టాలీవుడ్ మార్కెట్ రేంజ్ చూస్తుంటే, రుక్మిణికి ఇక్కడ తిరుగుండదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.టాలీవుడ్ ఇప్పుడు కేవలం ప్రాంతీయ భాషా చిత్రాలకే పరిమితం కాకుండా గ్లోబల్ మార్కెట్‌ను శాసిస్తోంది. ఇక్కడ నిలదొక్కుకుంటే బాలీవుడ్ అవకాశాలు కూడా వాటంతట అవే తలుపు తడతాయి. ఈ క్రమంలో రుక్మిణి కూడా తెలుగు సినిమాల వైపే మొగ్గు చూపే అవకాశం ఉంది. అలా జరిగినప్పుడు కన్నడ ఆడియన్స్ రియాక్షన్ ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


# గ్రాండ్ ఎంట్రీ?



ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రంపై మళ్లీ చర్చ జోరందుకుంది. అకీరా ఎంట్రీ ఎప్పుడు? ఎవరి దర్శకత్వంలో? అనే ప్రశ్నలు గత కొంత కాలంగా ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పుడు ఈ చర్చలో టాలెంటెడ్ హీరో/డైరెక్టర్ అడివి శేష్ పేరు వినిపించడం ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇంతకుముందు అకీరాను శేఖర్ కమ్ముల పరిచయం చేయబోతున్నారనే వార్తలు వినిపించాయి. కానీ తాజాగా అడివి శేష్ అకీరా డెబ్యూ బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం ఊపందుకుంది.

అకీరాతో శేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఈ వార్తలకు బలం ఇస్తోంది. ముఖ్యంగా ‘రైటర్స్ బ్లాక్’ షార్ట్ ఫిల్మ్‌కు అకీరా సంగీతం అందించినప్పుడు శేష్ మద్దతుగా నిలిచారు. ఆ అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. ‘క్షణం’, ‘గూఢచారి’, ‘మేజర్’ వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన అడివి శేష్... అకీరా కోసం ప్రత్యేకమైన, వైవిధ్యమైన కథ సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. వారసుడి డెబ్యూ కాబట్టి సాధారణ కమర్షియల్ ఎంట్రీ కాకుండా, కంటెంట్ బేస్డ్ మూవీతో లాంచ్ చేయాలని పవన్ కల్యాణ్ కూడా భావిస్తున్నారట.

# బెదిరింపులు



బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ‘ధురంధర్’ సక్సెస్ తర్వాత బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. వాట్సాప్ వాయిస్ నోట్ ద్వారా కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ గుర్తుతెలియని వ్యక్తి బెదిరించినట్లు సమాచారం. ఈ విషయం ముంబయి పోలీసుల దృష్టికి వెళ్లడంతో క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు ప్రారంభించింది. బెదిరింపుల నేపథ్యంలో రణ్‌వీర్ నివాసం వద్ద భద్రతను పెంచారు. వాట్సాప్ వాయిస్ నోట్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తి నుంచి బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ పంపిన ఈ వాయిస్ మెసేజ్ బాలీవుడ్‌లోనే కాదు, భద్రతా వర్గాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది.

ఈ బెదిరింపు వాయిస్ నోట్‌లో డబ్బులు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ముంబయి పోలీసుల దృష్టికి వెళ్లడంతో వెంటనే క్రైమ్ బ్రాంచ్ రంగంలోకి దిగింది. వాయిస్ నోట్ పంపిన వ్యక్తి తనను తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నవాడిగా పేర్కొన్నట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఈ అంశంపై పోలీసులు అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతం ఆ వాయిస్ నోట్ ట్రేస్ చేయడం, కాల్ డేటా, డిజిటల్ ఆధారాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది.

బెదిరింపుల నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ నివాసం వద్ద భద్రతను భారీగా పెంచారు. ముంబయి జుహులో ఉన్న ఆయన ఇంటి చుట్టూ పోలీసు బలగాలు, ప్రైవేట్ బాడీగార్డులను మోహరించారు. రణ్‌వీర్ సింగ్, ఆయన భార్య దీపికా పదుకొనే నివసించే హౌసింగ్ సొసైటీలోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

# మారిపోయింది



ప్రముఖ హీరో రవి మోహన్ నా జీవితంలోకి ప్రవేశించిన తర్వాత ప్రపంచమే మారి పోయిందని ప్రముఖ గాయని కెనిషా అభి,ప్రాయ పడ్డారు. ఈ నెల 7వ తేదీ తన పుట్టిన రోజు వేడుకలను రవి మోహన్‌తో కలిసి ఘ నంగా జరుపుకున్న కెనిషా.. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు.

‘బాల్యం నుంచే నన్ను ఎవరూ కూడా ఒక మనిషిగా గుర్తించలేదు. ప్రతి ఒక్కరూ దూరం పెట్టారనే భావన నాకు ఉండేది. నేనే ఏదో పెద్దగా ఆశిస్తున్నానని అనుకునే వారు. కానీ, వారి నుంచి నేను ఎదురు చూసింది కేవలం రవ్వంత ప్రేమ, గౌరవ మర్యాదలు మాత్రమే. రవి మోహన్ వచ్చిన తర్వాత నా ప్రపంచమే మారిపోయింది. నా ఆలోచ నలు, వ్యవహాం శైలి, ప్రేమ వంటి విషయాల్లో నా ఆలోచనా విధంగా కొత్తగా ఉంది’ అని పేర్కొ న్నారు.

# వైద్య పట్టా

అందాల హీరోయిన్ శ్రీలీల ఇప్పుడు అధికారికంగా డాక్టర్ అయ్యారు. సినిమాల్లో నటిస్తూనే ఆమె వైద్య విద్యను అభ్యసించారు. ఆమె ముంబైలోని డివై పాటిల్ విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య పట్టాను అందుకున్నారు. ఫిబ్రవరి 10న జరిగిన ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అభిమానులు, పలువురు నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఒక చిత్రంలో వేదికపై మెరూన్ రంగు దుస్తులు ధరించిన శ్రీలీల స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీని స్వీకరిస్తున్నట్లు ఉంది.

తన ఇంట్లో జరిగిన ఒక సంఘటన కారణంగా తాను డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నట్లు శ్రీలీల ఒక సందర్భంలో వెల్లడించారు. ఓసారి తన అమ్మమ్మ కిందపడిపోయినప్పుడు, వైద్యుడైన తన అన్నయ్య వచ్చి చిన్నపాటి చేయడంతో ఆమె మామూలు స్థితికి వచ్చిందని అన్నారు. అప్పుడే తాను డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఆ కారణంగానే సినిమాల్లోకి వచ్చినప్పటికీ డాక్టర్‌గా సేవ చేయాలన్న తన సంకల్పాన్ని వదల్లేదని అన్నారు.



Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.